ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
భద్రాద్రి కొత్తగూడెం
ఉష్ణోగ్రత | ఖమ్మం: గరిష్ఠం 33 । కనిష్ఠం 18 | భద్రాద్రి: గరిష్ఠం 35 । కనిష్ఠం 25 | శనివారం, 17 ఫిబ్రవరి 2024



కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా కాంగ్రెస్ సహా వామపక్షాలు చేపట్టిన 'దేశవ్యాప్త సార్వత్రిక సడక్‌బంద్' శుక్రవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విజయవంతమైంది. ఆర్టీసీ బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. వ్యాపార, వాణిజ్య సముదాయాలు తెరుచుకోలేదు. పలుచోట్ల బీజేపీయేతర పార్టీల ఆధ్వర్యంలో రాస్తారోకోలు చేపట్టారు. తెల్లవారుజాము నుంచే ఆర్టీసీ డిపో ప్రధాన రహదారులపై ప్రజాసంఘాల నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టి వాహనాలను అడ్డగించారు. రఘునాథపాలెం మండలం మంచుకొండలో ఖైదీలను తరలిస్తున్న వాహనం రాస్తారోకోలో చిక్కుకుపోవడంతో కొద్దిసేపు ఉద్రిక్తత ఏర్పడింది. పోలీసులు జోక్యం చేసుకోవడంతో ఆందోళనకారులు ఖైదీల వాహనానికి దారి ఇచ్చారు. ఇక ఖమ్మం బైపాస్ రోడ్డులో సీపీఎం, సీపీఐ, ప్రజాపంథా, కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున రాస్తారోకో నిర్వహించారు. అలాగే కొత్తగూడెంలోని ఓల్డ్ డిపో నుంచి బస్టాండ్ సెంటర్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం బహిరంగసభ నిర్వహించారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం

5

హోరెత్తిన నిరసన



నిర్మానుష్యంగా భద్రాద్రి జిల్లా పాల్వంచలోని శాస్త్రి రోడ్



ఖమ్మం పాత బస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న అఖిలపక్ష నాయకులు



కొత్తగూడెంలో...

- 'దేశవ్యాప్త సార్వత్రిక సడక్ బంద్' ప్రశాంతం
- ఆందోళనల్లో పాల్గొన్న కాంగ్రెస్ సహా వామపక్షాలు, ప్రజాసంఘాల నేతలు
- స్వచ్ఛందంగా బంద్ పాటించిన వ్యాపార, వాణిజ్య వర్గాలు
- ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల రాస్తారోకోలు, ర్యాలీలు
- మంచుకొండ వద్ద రాస్తారోకో... నిలిచిపోయిన ఖైదీల తరలింపు వాహనం
- ఖమ్మంలో రాస్తారోకోలో పాల్గొన్న ప్రముఖులు
- కొత్తగూడెంలో దద్దరిల్లిన భారీ ప్రదర్శన



బంద్ సందర్భంగా నిర్మానుష్యంగా మారిన ఖమ్మం కమాన్‌బజార్

భద్రాద్రి ఈవోగా రమాదేవి కొనసాగింపు

కీసర ఆర్డీవోగా బదిలీ ఉత్తర్వుల రద్దు



భద్రాచలం, ఫిబ్రవరి 16: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆలయ అభివృద్ధికి అవిరళ కృషి చేస్తున్న ఈవో ఎల్.రమాదేవిని ఇక్కడే కొనసాగించాలంటూ రామ భక్తులు, వివిధ రాజకీయపక్షాలు, ఉద్యోగ సంఘాలు కోరిన క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఆమెను భద్రాద్రి దేవస్థానం ఈవోగా కొనసాగిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. భద్రాద్రి దేవస్థానం ఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎల్.రమాదేవిని కీసర ఆర్డీవోగా బదిలీ చేస్తూ ఈ నెల 12న రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా, ఆమెను ఇక్కడే కొనసాగించాలని వివిధ రాజకీయపార్టీల, ఉద్యోగ సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం రమాదేవిని ఈవోగా కొనసాగిస్తూ శుక్రవారం జీవో నెం. 88 జారీ చేసింది. రమాదేవి కొనసాగింపు విషయంలో జిల్లా మంత్రులతో పాటు దేవాదాయ శాఖ మంత్రి చొరవ తీసుకున్నట్లు సమాచారం.

ఐదుగురు ఎన్డీ సాయుధ నక్సల్స్ అరెస్ట్

- రాష్ట్ర కార్యదర్శి సహా ఇద్దరు దళ కమాండర్లు
- మందుగుండు సామగ్రి స్వాధీనం
- ఆయుధాలతో సంచరిస్తే సహించం: ఎస్పీ రోహిత్

5



అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యేలు





- వైరా రిజర్వాయర్‌లో నిత్యం 18 అడుగుల నీటి నిల్వ ఉంచాలి : రాందాస్‌నాయక్
- పోడు రైతులకు కరెంటు సౌకర్యం కల్పించాలి : కోరం కనకయ్య

5



ఇసుకాసురులు

- అక్రమంగా తరలిపోతున్న గోదావరి ఇసుక
- దందా వెనుక హైదరాబాద్ మాఫియా
- ఒక్కో లారీకి రూ.50వేల పైనే లాభం
- మామూళ్లకు మరిగి నిద్ర నటిస్తున్న అధికారులు
- భద్రాచలం సరిహద్దుల్లోని ఆంధ్రాలో జోరుగా తవ్వకాలు
- ఉమ్మడి జిల్లా మీదుగా హైదరాబాద్‌కు తరలింపు

మళ్లీ ఇసుక మాఫియా పంజా విసురుతోంది. రాత్రివేళ వరుసగా లారీలలో తరలిస్తూ నోట్లకు పడగలెత్తుతున్నారు. గోదావరి ఇసుకపైనే కన్నేసి ముడుపుల పెట్టుబడితో అక్రమంగా ఇసుక రవాణా సాగిస్తున్నారు. హైదరాబాదుకు చెందిన ఇసుక మాఫియా తమ పరపతి, పలుకుబడి ఉపయోగించి గోదావరి ఇసుకను రాత్రివేళ తరలించుకుపోతున్నారు.

ఖమ్మం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మణుగూరు ప్రాంతంలోని కొన్ని సొసైటీలలో ఇసుక తవ్వకాలు జరుగుతుండగా వేబిల్స్ లేకుండా కొన్ని లారీలు ఇసుక తరలిస్తున్నాయి. లారీల్లో నిర్ణీత ఇసుక కంటే అదనంగా రవాణా సాగిస్తున్నారు. ఇటీవల సారపాక సమీపంలో పట్టుకున్న 17 లారీల ఉదంతంతో గోదావరి నుంచి ఇసుక దందా ఎలా సాగుతుందో అర్థమవుతుంది. భద్రాచలానికి ఆనుకుని ఆంధ్రా సరిహద్దు ఉండడంతో అక్కడ పాడేరు జిల్లా పరిధిలోని యటపాక మండలం గుండాల, కొల్లుగూడెం ప్రాంతల నుంచి ఇసుక త్వకాలు జరిపి ఆంధ్రా ఇసుకను రాత్రివేళ తరలిస్తున్నారు. మరోవైపు బూర్గంపాడు సమీపంలోని ఆంధ్రావైపున ఉన్న కుకునూరు మార్గంలో కిన్నెరసాని ఇసుకతోపాటు గోదావరి ఇసుకను రవాణా చేస్తున్నారు. కొన్ని ములకలపల్లి మార్గంలో పాల్వంచ మీదుగా ఆంధ్రా ఇసుక తరలిస్తున్నారు.

ప్రతిరోజు రాత్రివేళ వరుసగా పదినుంచి 15లారీలు ఇసుక రవాణా చేస్తున్నాయి. వాటికి ముందు ఎస్కార్టుగా ఇసుక మాఫియా సభ్యులు కారులో ముందు వెళ్లడం చెక్‌పోస్టులు, తనిఖీలు పరిస్థితి పసిగట్టడం, వెనుక లారీల డ్రైవర్లకు సమాచారం ఇవ్వడం ఇలా పోలీసులు మైనింగ్, రవాణా శాఖ అధికారులు లారీలు పట్టుకోకుండా లారీకి రూ.5వేలకు పైగా మామూళ్లు ముట్టచెబుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. దీంతో రాత్రివేళ ఇసుక రవాణా జోరుగా నడుస్తున్నది. వాస్తవానికి రవాణా, పోలీసుశాఖలు తోపాటు కొత్తగా టీఎస్ఎండీసీ అధికారులు కూడా చెక్‌పోస్టులు ఏర్పాటుచేశారు. భద్రాచలం నుంచి పలు చెక్‌పోస్టులున్నా తూతూమంత్రపు తనిఖీలే సాగుతున్నాయి. ఎప్పుడైనా పత్రికల్లో వార్తలు వచ్చినప్పుడు ఎవరైనా ఈ ఫిర్యాదు చేసినప్పుడు పట్టుకోవడం తప్పితే, మళ్లీ ఇసుక అక్రమరవాణ దందాసాగుతూనే ఉంది.



మణుగూరు వైపు కొన్ని గిరిజన సొసైటీల పేరుతో ఇసుక తవ్వకాలు అధికారికంగా సాగుతుండగా అనధికారికంగా కూడా ఇసుక తరలించుకుపోతున్నట్టు తెలిసింది. మరి కొన్ని సొసైటీల పేరుతో కొందరు అధికార పార్టీ నేతలు అనుమతులు కోసం పైరవీలు సాగిస్తున్నారు. ఇటు తెలంగాణ ఇసుకను అటు ఆంధ్రా ఇసుకను అక్రమమార్గంలో హైదరాబాద్ తరలించి కోట్లు దండుకుంటున్నారు. ఒక్కో లారీకి రూ.50వేల పైగా లాభం ఉండడంతో హైదరాబాదుకు చెందిన ఇసుక వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి దందా నడిపిస్తున్నారు

ఎవరు అధికారంలో ఉంటే ఆ పార్టీలకు చెందిన నేతల పలుకుబడిని ఇసుక దందాకు వినియోగిస్తున్నారు. ఇప్పటికైనా భద్రాద్రి కొత్తగూడెంతో పాటు ఖమ్మం జిల్లాలో టీఎస్ఎండీసీ, మైనింగ్, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు సీసీ కెమెరాలతో పాటు నిరంతర తనిఖీలు రాత్రిపూట జరిపితే అక్రమ ఇసుక రవాణాకు చెక్ పడుతుంది.

కౌంటింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి

- కలెక్టర్ గౌతమ్, సీపీ సునీల్‌దత్
- పొన్నేకల్లులో కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూంల సందర్శన



పొన్నేకల్లు కళాశాలను పరిశీలిస్తున్న కలెక్టర్, సీపీ

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 16: త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ గౌతమ్, సీపీ సునీల్ దత్ అధికారులకు సూచించారు. ఖమ్మంరూరల్ మండలం పొన్నేకల్లు పరిధిలోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలోని కౌంటింగ్, స్ట్రాంగ్ రూమ్‌లను వారు పరిశీలించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎంపీడీవోలకు తమ తమ మండల పరిధిలోని ఎన్నికల సంబంధ ఏర్పాట్లపై బాధ్యతలు అప్పగించాలన్నారు.ఈవీఎంల రవాణా పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఒకే భవనంలో 7 నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్ జరగనున్నందున ఏ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలు ఆ నియోజకవర్గానికి వెళ్లేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలైన ఈవీఎం బ్యాలెట్లు సీఆర్పీఎఫ్ రక్షణతోనే తరలించాలని, సెక్టార్ అధికారులకు అవగాహన కల్పించాలన్నారు.

ప్రతి పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలు అమర్చాలన్నారు. జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఎన్నికల సరళిని నిరంతరం పరిశీలిస్తూ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. అనంతరం సీపీ సునీల్‌దత్ మాట్లాడుతూ పార్కింగ్ ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేయాలన్నారు. ఈవీఎంల రవాణా సందర్భంలో భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదర్శ్ సురభి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, ఖమ్మం, కొత్తగూడెం-భద్రాద్రి జిల్లాల అదనపు కలెక్టర్లు మధుసూదన్ నాయక్, రాంబాబు,ఆర్డీవోలు గణేష్, అశోక్ చక్రవర్తి, మధు, ఎస్డీసీ ఎం.రాజేశ్వరీ పాల్గొన్నారు.



డీసీసీబీ పీఠంపై

'దొండపాటి'



- డీసీవో ఉత్తర్వుల మేరకు బాధ్యతల స్వీకరణ
- అవిశ్వాసంతో పదవి కోల్పోయిన ప్రస్తుత చైర్మన్ నాగభూషయ్య
- వి.వెంకటాయపాలెం సొసైటీకి 20న ఎన్నిక

ఖమ్మం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ నూతన చైర్మన్‌గా ప్రస్తుత వైస్ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావును నియమిస్తూ జిల్లా సహకార అధికారి మురళీధరరావు ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు శుక్రవారం వెంకటేశ్వరరావు చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. చైర్మన్ పదవికి ఎన్నిక జరిగే వరకు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. ఇప్పటివరకు చైర్మన్‌గా ఉన్న కూరాకుల నాగభూషయ్య.. సొసైటీ అధ్యక్ష పదవితోపాటు డీసీసీబీ చైర్మన్ పదవిని కూడా కోల్పోయారు. బీఆర్ఎస్‌కు చెందిన నాగభూషయ్య పై 13మంది సభ్యులకుగాను 11మంది సభ్యులు అవిశ్వాసం ప్రకటిస్తూ జిల్లా సహకార అధికారికి ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఈ క్రమంలో నిర్వహించిన అవిశ్వాస ఓటింగ్‌లో వ్యతిరేకంగా 11మంది ఓటు వేశారు. అయితే తనపై నిర్వహించిన అవిశ్వాసం చెల్లదని నాగభూషయ్య హైకోర్టుకు వెళ్లడంతో తీర్పును తాత్కాలికంగా నిలిపివేశారు. ఆ తర్వాత హైకోర్టు అవిశ్వాస ఓటింగ్ నిర్వహించి నిబంధనల ప్రకారం ఎన్నిక నిర్వహించాలని ఆదేశించింది. దీంతో జిల్లాలో సహకార అధికారి వి.వెంకటాయపాలెం సొసైటీ డైరెక్టర్లు అవిశ్వాస సమావేశంలో చైర్మన్‌పై అవిశ్వాసాన్ని ప్రకటిస్తూ 11మంది ఓటింగ్ వేసినందున చైర్మన్ పదవి నుంచి తొలగిస్తూ ఆ సొసైటీలో వైస్ చైర్మన్‌గా ఉన్న రాయల శ్రీనివాసరావుకు చైర్మన్ బాధ్యతలు అప్పగించారు. ఈనెల 20న వి.వెంకటాయపాలెం సొసైటీ చైర్మన్ ఎన్నిక నిర్వహిస్తున్నట్టు ఆదేశాల్లో తెలిపారు. దీంతో సొసైటీ అధ్యక్ష పదవి కోల్పోయిన నాగభూషయ్య డీసీసీబీ డైరెక్టర్ పదవితోపాటు డీసీసీబీ చైర్మన్ పదవి కూడా కోల్పోవాల్సి వచ్చింది.

డీసీసీబీ చైర్మన్ పదవి ఖాళీ కావడంతో వైస్ చైర్మన్‌గా ఉన్న దొండపాటి వెంకటేశ్వరరావుకు చైర్మన్ బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా సహకార అధికారి ఆదేశాలు జారీ చేయడంతో శుక్రవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. పదవి కోల్పోయిన డీసీసీబీ చైర్మన్ నాగభూషయ్య బీఆర్ఎస్‌లో కొనసాగుతుండగా ప్రస్తుతం చైర్మన్‌గా నియమితులైన వెంకటేశ్వరరావు ఇటీవలే బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. డీసీసీబీ చైర్మన్ పదవికి డైరెక్టర్ల పూర్తిస్థాయి మద్దతు ఉంటే కాంగ్రెస్ కైవసం చేసుకునే అవకాశం ఉంది. అయితే డీసీసీబీ చైర్మన్‌కు ఎన్నిక ఎప్పుడు ఉంటుందన్న దానిపై ఇంకా ఆదేశాలు వెలువడాల్సి ఉంది. డైరెక్టర్ల పూర్తిస్థాయి మెజారిటీ ఉంటేనే ఎన్నికల బరిలోకి కాంగ్రెస్ దిగనుంది. లేకుంటే ప్రస్తుతం చైర్మన్‌గా నియమితులైన వెంకటేశ్వరరావు గడువు పూర్తయ్యే వరకు కొనసాగే అవకాశం ఉంది.

భాష అర్థం కాక, దొంగ అనుకున్నారు...



- గుదిమళ్లలో మధ్యప్రదేశ్ వాసిపై గ్రామస్తుల దాడి
- తీవ్రగాయాలతో ఆస్పత్రిపాలు
- కేసు నమోదు చేసిన పోలీసులు
- అపరిచితులపై అకారణంగా దాడి చేయవద్దని హెచ్చరిక

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 16: వాట్సప్‌లలో వచ్చే రకరకాల సమాచారాలతో గ్రామాల్లోకి ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు వస్తే, స్థానికులు వారిని అనుమానించి వారిపై దాడులకు పాల్పడుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నా యి. ముఖ్యంగా తెలుగు భాషరాని అమాయకులు బలైపోతున్నారు. ఇందుకు ఖమ్మం రూరల్ మండలం గుదిమళ్ల గ్రామంలో గురువారం రాత్రి చోటుచేసుకున్న సంఘటనే సాక్ష్యం. ఓ అమాయకుడిని పట్టుకుని చితకబాదిన గ్రామస్తులపై పోలీసులు శుక్రవారం కేసునమోదు చేశారు.

ఖమ్మంరూరల్ ఏసీపీ బస్వారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శివరామ్‌సింగ్ అనే వ్యక్తి ముదిగొండ మండలం పండ్రేగిపల్లి గ్రామంలోని బీవీఆర్ స్టోన్ క్రషర్‌లో కూలీగా పనిచేస్తున్నాడు. గురువారం ఖమ్మం వెళ్లి తన పనులు ముగించుకుని ఆటోలో పండ్రేగిపల్లికి తిరిగి వస్తున్న క్రమంలో ఆటో డ్రైవర్ పొరపాటున అతన్ని గుదిమళ్లలో వదిలేసి వెళ్లాడు. చిరునామా తెలియని శివరామ్‌సింగ్ హిందీలో అక్కడున్న వ్యక్తిని అడ్రస్ అడిగాడు. ఆయనకు శివరామ్‌సింగ్ భాష అర్థం కాలేదు. దీంతో దొంగ దొంగ అని అరిచాడు. ఆ అరుపులు విని గ్రామస్తులు శివరామ్‌సింగ్‌ను పట్టుకుని విచక్షణారహితంగా కర్రలతో కొట్టి తీవ్రంగా గాయపరిచారు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు గ్రామానికి చేరుకుని గాయాలైన శివరామ్‌సింగ్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం అతని నుంచి వివరాలు సేకరించారు. శివరామ్‌సింగ్‌పై దాడికి పాల్పడిన గుదిమళ్లకు చెందిన దోమల వెంకటేష్‌తోపాటు మరి కొందరిపై కేసునమోదు చేశారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే డయల్ 100కి ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. చిన్నపిల్లల కిడ్నాప్ ముఠా అంటూ వస్తున్న వదంతులు నమ్మవద్దన్నారు.

పోచారంలో అనుమానితుడి పట్టివేత

కూసుమంచి: మండలంలోని పోచారంలో కత్తులు, బ్లేడ్‌లతో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని గ్రామస్థులు పట్టుకున్నారు. వెంటనే 100 నెంబర్‌కు డయల్ చేయగా, పోలీసులు వచ్చి అదుపులోకి తీసుకున్నారు. దుండగుడు బెంగాలీ భాష మాట్లాడుతున్నాడని గ్రామస్థులు తెలిపారు.

కొవ్వూరు-భద్రాచలం రోడ్డు

రైల్వే‘లైన్ క్లియర్’

● రూ.2,154కోట్లు ఖర్చుతో 151.90 కిలో మీటర్ల ట్రాక్



అశ్వారావుపేట/కొత్తగూడెం, ఫిబ్రవరి16: కొవ్వూ రు-భద్రాచలం రైల్వే లైను పనుల భూసేకరణ ముమ్మరంగా కొనసాగుతోంది. ప్రతి ఎన్నికలలో ఈ రైల్వేలైను మంజూరు చేయిస్తామని ఆది నుంచి ఇప్పటివరకు పోటీచేసే అభ్యర్థులు హామీ ఇవ్వడం ఆనవాయితీగా మారిపోయింది. ఇన్నేళ్లుగా ఎదురు చూసిన ఈ ప్రాంత ప్రజల కలలు నేడు నిజం కాబో తున్నాయి. దక్షిణ మధ్య రైల్వే భద్రాచలం రోడ్డు-కొవ్వూరు రైల్వే లైను పనులకు త్వరలోనే ప్రారంభించనున్నట్లు పబ్లిక్ డొమైన్‌లో ప్రకటించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే ఈ రైల్వేలైను పనులకు పచ్చ జెండా ఊపింది. 2024 ఏప్రిల్ 1న సత్తుపల్లి వైపు నుంచి ఈ పనులను ప్రారంభించేందుకు ఎస్సీఆర్ జనరల్ మేనేజర్ నేతృత్వంలో ఏర్పాట్లు జరుగుతున్నట్టు విశ్వసనీయ సమాచారం.

గ్రీన్‌ఫీల్డ్‌హైవేకు సమాంతరంగా ఎలైన్‌మెంట్

భద్రాచలం రోడ్డు టు కొవ్వూరు రైల్వే లైనుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. మొత్తం 151.90 కిలో మీటర్ల రైల్వే ట్రాక్‌లు, వంతెనలు, ఇతరత్రా పనుల కోసం ప్రస్తుతం అంచనా ప్రకారం రూ.2,154.83 కోట్లు ఖర్చును వెచ్చిస్తున్నారు. కాగా 2015లో టెండర్, భూసేకరణ ప్రక్రియలు ప్రారంభమయ్యాయి. అప్పట్లో సింగరేణి భాగస్వామ్యంతో సత్తుపల్లి వరకు రైల్వే లైను మంజూరై పూర్తి అయ్యింది. ప్రస్తుతం రైళ్ల రాకపోకలు నడుస్తున్నాయి. ఇప్పుడు సత్తుపల్లి నుంచి కొవ్వూరు వరకు ప్రస్తుతం నిర్మాణం జరుగుతున్న ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డుకు పక్కనే సమాంతరంగా నిర్మించనున్నారు. సత్తుపల్లి-తుంబూరు-టీ నర్సాపురం మీదుగా దేవరపల్లి కొవ్వూరు లైనుకు కలుస్తుందని తెలుస్తోంది. ఈ రైల్వే లైను వల్ల దాదాపు 75 కిలో మీటర్ల దూరం కూడా తగ్గనుంది. ఇప్పటికే గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మా ణం పూర్తి కావస్తుండటంతో దాని వెంట రైల్వే లైను నిర్మాణం తేలికకానుంది. గత కొద్దిరోజుల నుంచి అశ్వారావుపేట మీదుగా హెలికాప్టర్ తరుచూ తిరుగుతుందనే ప్రచారం ఉంది. ఇది ఈ రైల్వే లైను పనుల అలైన్‌మెంట్, జీలుగుమిల్లి దగ్గర నిర్మించే ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ అవసరాలకోసమే తిరుగుతుందనే ప్రచారం ఉంది.

ఏప్రిల్ 1 ప్రారంభం కానున్న పనులు

దక్షిణ మధ్య రైల్లే లైను పబ్లిక్ డొమైన్‌లో పెట్టిన ప్రకారం ఏప్రిల్ 1, 2024న ఈ రైల్వే లైనును ప్రారంభించినున్నట్టు తెలుస్తోంది. మార్చి 2030 కల్లా పూర్తి చేయాలనే లక్ష్యంగా అధికారులు పెట్టుకున్నారు. ఉత్తత్తి అవుతున్న లక్షల టన్ను బొగ్గు ఉత్పత్తులను పశ్చిమబెంగాల్, బీహార్, ఒరిస్సా, జార్ఖండ్, అస్సాం వంటి ఈశాన్య ప్రాంతాలలోని స్టీల్ ప్లాంట్లకు బొగ్గు రవాణా ఈ లైను వల్ల సులభతరం కానుంది. ఇప్పటికే మొత్తం అలైన్‌మెంట్ పనులు, భూ సేకరణ చివరిదశకు చేరుకున్నాయి. పై అవసరాలతో పాటు జీలుగుమిల్లి వద్ద మంజూరైన నేవీ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ అవసరాలకోసం టీ నర్సాపురం వద్ద నేవీ మెటీరియల్ లోడింగ్ పాయింట్‌ను ఏర్పాటు చేసే అవకాశాలున్నట్టు తెలుస్తోంది.

పూర్తికావస్తున్న భూసేకరణ

1960వ దశకంలో జరిగిన సర్వేలో అప్పటి అవసరాల రీత్యా భద్రాచలం రోడ్డు స్టేషన్ నుంచి సత్తుపల్లి, దమ్మపేట, అశ్వారావుపేట, జీలుగుమిల్లి, బుట్టాయిగూడెం, జంగారెడ్డిగూడెం మండలాల మీదుగా కొవ్వూరుకు రైల్వే లైను వెళ్తుందని సర్వే చేశారు.

ఈ మేరకు ఆయా ప్రాంతంలో మార్కింగ్‌కూడా చేశారు. సాయిల్ టెస్ట్, ఇతర సాంకేతిక పరమైన చర్యలు తీసుకున్నారు. తాజాగా మారిన అవసరాల నేపథ్యంలో సత్తుపల్లి నుంచి టీ నర్సాపురం మీదుగా గ్రీన్‌ఫీల్డ్ హైవేరోడ్డు పక్క నుంచి రైల్వేలైనును నిర్మిస్తున్నారు. దీంతో అశ్వారావుపేట ప్రాంతం మీదుగా వెళుతుందనుకున్న రైల్వే లైను దాదాపు 20కిలో మీటర్ల దూరం నుంచి వెళ్తుతుంది. కొన్ని దశాబ్దాల కల నిజమవుతుందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల, రాంచంద్రప్రసాద్

అగ్రి ఎగ్జిబిషన్ రైతులకు ఎంతో ఉపయోగం

● పామాయిల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రాంచంద్రప్రసాద్

దమ్మపేట, ఫిబ్రవరి, 16: హైదరాబాద్ రాజేంద్రనగర్‌లో ఏర్పాటు చేసిన అగ్రి ఎగ్జిబిషన్ రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని పామాయిల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రాంచంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఎగ్జిబిషన్‌లో వ్యవసాయ యాంత్రికరణకు ఉపయోగపడే యంత్రాలు, ఆర్గానిక్ పంటలు, వివిధ ఉత్పత్తులు ప్రదర్శనలు రైతులకు విలువైన సమచారం ఉపయోగపడుతుందన్నారు. మూడు రోజులు పాటు నిర్వహించే ఎగ్జిబిషన్ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాల్సిందిగా కోరారు. ఆయన వెంట పామాయిల్ సంఘం నాయకులు కందిమళ్ల కృష్ణారావు, బండి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఐఏఎల్ ఉమ్మడి జిల్లాల సన్నాహక సమావేశం 24న

ఖమ్మం లీగల్, ఫిబ్రవరి 16: ఖమ్మం జిల్లాలో ఈ నెల 24 న ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్) ఉమ్మడి జిల్లాల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు సీనియర్ న్యాయవాది షేక్ లతీఫ్ తెలిపారు. శుక్రవారం ఐఏఎల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో ఐఏఎల్ న్యాయవాదులు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది పెమ్మసాని పట్టాభి, పారుపల్లి అమర్‌చంద్, ఓరుగంటి శేషగిరిరావు, కొలికొండ శరత్‌బాబు, జి.వి.లక్ష్మీనారాయణ, మేకల నవీన్‌కుమార్, ఎం.డి.పర్వేజ్, సుంకరబోయిన సత్యనారాయణ, బాగం మాధవరావు, వై.ఉదయ్‌భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ క్రీడల ముగింపు నేడు

● హాజరుకానున్న మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు రామారావు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఫిబ్రవరి 16: టీఎన్జీవోస్- జిల్లా యువజన క్రీడలశాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఖేలో భద్రాద్రి క్రీడల శనివారం ముగియనున్నట్లు టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అమరనేని రామారావు, కంచర్ల భార్గవచైతన్య తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ రెండు రోజులుగా క్రీడలు ఎంతో హుశారుగా కొనసాగుతున్నాయన్నారు. ఖేలో భద్రాద్రి క్రీడల ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. క్రీడా పోటీలకు సహకరించిన కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ రోహిత్‌రాజు, జిల్లా అడిషనల్ కలెక్టర్ రాంబాబు, భద్రాచలం ఐటీడీఏపీవో ప్రతీక్‌జైన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి యువజన క్రీడల అధికారి టి.సీతారామ్, జిల్లా క్రీడల కన్వీనర్ జి.సోమయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు సీహెచ్.రామనర్సయ్య, రాష్ట్ర కార్యదర్శి జి.వీరబాబు పాల్గొన్నారు.

రెండు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు

కల్లూరు, ఫిబ్రవరి 16: కల్లూరు మండలంలోని చెన్నూరు గ్రామంలో మాజీ ఏఎంసీ చైర్మన్ గొర్రెపాటి రాధయ్య జ్ఞాపకార్థంగా ఈ నెల 21 నుంచి మూడు రోజుల పాటుగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల స్థాయిలో కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు క్రీడా నిర్వహకుడు మన్నె చంటి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రీడల పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఈ నెల 20 తేదీలోగా తమ టీమ్‌లను నమోదు చేయించుకోవాలని కోరారు వివరాలకు 80081 71448, 93473 69596 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

పురుషులతో సమానంగా పోటీ పడాలి

ఖమ్మం ఖానాపురంహవేలి, ఫిబ్రవరి 16: పురుషులతో సమానంగా పోటీ పడాలని మహిళా ప్రాంగణం అధికారి వేల్పుల విజేత అన్నారు. ఇటీవల వెలువడిన ఎంపీహెచ్‌డబ్ల్యూ ఫలితాల్లో ప్రతిభ సాధించిన మహిళా ప్రాంగాణం అభ్యర్థులను అభినందించి మాట్లాడారు. ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టు కింద రాష్ట్ర ప్రభుత్వం 2022 నుంచి మహిళా ప్రాంగాణాల్లో రెండేళ్ల నర్సింగ్ కోర్సును ప్రవేశపెట్టారని తెలిపారు. ఇటీవల వెలువడిన మొదటి సంవత్సర ఫలితాల్లో మహిళా ప్రాంగణం అభ్యర్థులు రాష్ట్ర స్థాయిలో 2, 4 ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. ఉన్నతాధికారుల సహకారంతో ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా సమ్మక్క-సారలమ్మ జాతర

జూలూరుపాడు, ఫిబ్రవరి16: మండలంలోని పడమటనర్సాపురం లో వన దేవతలను భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం మూడో రోజు జాతర కొనసాగింది. సారలమ్మ-సమ్మక్కలిద్దరు గద్దెపైకి చేరడంతో భక్తులు అమ్మవారులకు ప్రత్యేక పూజలు చేశారు. పుట్టబంగారాన్ని , బొనాలను సమర్పించారు.

రాముడిని దర్శించుకోవడం అదృష్టం

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు రంగాకిరణ్

కెపిఎస్, ఫిబ్రవరి16: అయోధ్యలో బాలరాముడిని దర్శించుకోవడం ఎంతో అదృష్టమని భద్రాద్రి జిల్లా బీజేపీ అధ్యక్షుడు కెవి.రంగాకిరణ్ అన్నారు. శుక్రవారం కొత్తగూడెం రైల్వే స్టేషన్‌లో అయోధ్యకు వెళ్లే భక్తులకు టిక్కెట్లను అందించి మాట్లాడారు. అయోధ్యకు వెళ్లేందుకు బీజేపీ ప్రభుత్వం ఆస్తా స్పెషల్ రైలును ఏర్పాటు చేసిందన్నారు. కొత్తగూడెం రైల్వే స్టేషన్ నుంచి 485 మంది రామ భక్తులు అయోధ్యకు బయలుదేరడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. భారతీయ రైల్వే, అయోధ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆస్తా స్పెషల్ రైలును నడిపించడం సంతో షకరమని అన్నారు. ఈ రైలు ప్రయాణంలో భక్తులకు భోజన వసతితో పాటు, అన్ని సౌకర్యాలను ట్రస్ట్ ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతలచెరువు శ్రీనివాసరావు, కార్యదర్శి భైరీ నిర్మల, చుంచుపల్లి మండల అధ్యక్షుడు రాయుడు నాగేశ్వరరావు, బిజెవైఎం జిల్లా అధ్యక్షులు వంశీ, నాయకులు ఎడ్లపల్లి శ్రీనివాస్‌కుమార్, ఆకుల నాగేశ్వరరావు, గొడుగు శ్రీధర్, పొడియం బాలరాజు, రవీందర్, లక్ష్మణగర్వల్, రైల్వే అధికారులు జేమ్స్‌పాల్, ఆర్‌పిఎఫ్ ఇన్‌స్పెక్టర్ గిరియా, సబ్ ఇన్‌స్పెక్టర్ సాయి, ఏఎస్ఐ స్వామి, అశోక్, స్టేషన్ మాస్టర్ ఆర్‌కె.మీనా, తదితరులు పాల్గొన్నారు.

కొత్త బొగ్గు గనులకు పూర్తి సహకారం అందిస్తాం

● బొగ్గు ఉత్పత్తి, రవాణాలో సింగరేణి పనితీరు భేష్

● కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి అమ్రిత్ లాల్ మీనా

కొత్తగూడెం, ఫిబ్రవరి 16: సింగరేణి పనితీరు సంతృప్తికరంగా ఉందని, సంస్థ అభివృద్ధి కోసం చేపట్టనున్న గనులకు పూర్తి సహకారం అందిస్తామని కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి అమ్రిత్ లాల్ మీనా హామీ ఇచ్చారు. శుక్రవారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో ఆయన సంస్థ చైర్మన్ అండ్ ఎండీ ఎన్ బలరామ్, ఇతర డైరెక్టర్లతో కంపెనీ ప్రగతిపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఆ సమీక్షలో సింగరేణి ప్రస్తుత పనితీరు, భవిష్యత్ ప్రణాళికలపై చైర్మన్ ఎన్ బలరామ్ వివరించారు. సింగరేణి ప్రాంతంలోని మూడు బొగ్గు బ్లాకుల కేటాయింపు పద్ధతిలో సింగరేణి సంస్థకే కేటాయించేలా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే రానున్న కాలంలో చేపట్టనున్న కొత్త గనులకు త్వరితగతిన అనుమతులు లభించేలా చూడాలన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వ శాఖ కార్యదర్శి స్పందిస్తూ నిబంధనలకు లోబడి సింగరేణి కి మేలు కలిగే విధంగా తగిన సహకారాన్ని అందిస్తామని, సింగరేణి భవిష్యత్తుకు ఎలాంటి ఇబ్బంది ఉండదని ఆయన హామీ ఇచ్చారు. అలాగే సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన సోలార్, థర్మల్ ప్రాజెక్టుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. సోలార్ రంగంలో చేపట్టే ప్రాజెక్టులపై కూలంకుశంగా తెలుసుకున్నారు. ఈ ఏడాది నిర్దేశించుకున్న 70 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్య సాధనలో ముందుండటంపై ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. సింగరేణి చేపట్టిన వ్యాపార విస్తరణ చర్యలైన థర్మల్, సోలార్, జియో థర్మల్, ఓబీ నుంచి ఇసుక ఉత్పత్తి, కమర్షియల్ ఇసుక తయారీ తదితర ప్రాజెక్టులపై అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో కేంద్ర బొగ్గు శాఖ అదనపు కార్యదర్శి రూపేందర్ బ్రార్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సంతోష్, సంస్థ డైరెక్టర్లు డి. సత్యనారాయణ రావు (ఈ అండ్ ఎమ్), ఎన్‌వీకే శ్రీనివాస్ (ఆపరేషన్స్ అండ్ పర్సనల్), జి.వెంకటేశ్వర రెడ్డి (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్), ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూమెంట్)జె ఆల్విన్, జీఎం(కో ఆర్డినేషన్) ఎం.సురేష్ ఇతర అధికారులు ఉన్నారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారిని కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి అమ్రిత్ లాల్ మీనా కలిసి పలు అంశాలపై చర్చించారు.



సింగరేణి పనితీరుపై ఉన్నతస్థాయి సమీక్షలో పాల్గొన్న సింరేణి అధికారులు

ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి: సీపీ

కల్లూరు, ఫిబ్రవరి 16 ప్రజలకు అందుబాటులో ఉంటూ ఫిర్యాదులపై తక్షణమే స్పందించి న్యాయం జరిగేలా చూడాలని సీపీ సునీల్‌దత్ స్పష్టం చేశారు. శుక్రవారం కల్లూరు పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలిం చారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలగించేలా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిఘా పెట్టాలని సూచించారు. సామాజిక మాధ్యమాలలో వచ్చే వదంతులు, అసత్య ప్రచారాలపై గ్రామీణ ప్రజలకు అవగహన కల్పించాలని ఆదేశించారు. సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిం చాలని పేర్కొన్నారు. డ్రగ్స్ నియంత్రణపై దృష్టి పెట్టాలన్నారు. పాత నేరస్తులను తనిఖీ చేయాలని కోరారు. కేసుల నమోదు విషయంలో తత్సారం చేయవద్దన్నారు. అదే విధంగా విధి నిర్వహణలో రోల్ క్లారిటీ ఉండాలని, అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూ పోలీసుల వ్యవస్థపై మరింత నమ్మకాన్ని పెంచాలన్నారు. ఆయన వెంట ఏసీపీ రఘు, సీఐ వెంకటేష్, ఎస్ఐ ఎస్‌కే షాకీర్‌లు పాల్గొన్నారు.



శాంతి భద్రతలపై సమీక్షిస్తున్న సీపీ సునీల్‌దత్

ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా మేడారం ప్రసాదం

● సత్తుపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి

సత్తుపల్లి: మేడారం సమ్మక్క సారక్క ప్రసాదాన్ని రూ.299 చెల్లించి భక్తులు పొందవచ్చునని సత్తుపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ యూ.రాజ్యలక్ష్మి తెలిపారు. శుక్రవారం డిపో కార్యాలయంలో రూ.299 చెల్లింపులు జరిపే పేటీఎం క్యూ ఆర్ కోడ్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేరుగా గద్దెల వద్ద నుంచి అందించనున్న ఈ ప్రసాదంలో బంగారం (బెల్లం), పసుపు, కుంకుమ ఉంటుందని, ఈనెల 26 నుంచి ముందుగా బుకింగ్ చేసుకున్న భక్తులకు ప్రసాదం అందిస్తామని చెప్పారు. వివరాలకు 91542 98585, 91542 98594లను సంప్రదించాలని కోరారు.

భద్రాచలం నుంచి మేడారానికి ప్రత్యేక బస్సులు

భద్రాచలం: మేడారం జాతరకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఈనెల 18 నుంచి ప్రతి 15 నిమిషాలకు ఒక బస్సు భద్రాచలం నుంచి మేడారంకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసినట్లు భద్రాచలం ఆర్టీసీ డిపో మేనేజరు రామారావు తెలిపారు. టికెట్ వెల పెద్దలకు రూ.300, పిల్లలకు రూ.160 చొప్పున నిర్ణయించడం జరిగింది. మేడారం వెళ్లే భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సత్తుపల్లిరూరల్: తమకు ఉన్న దాంట్లో సమాజానికి సేవ చేయాలనే తలంపు అభినందనీ యమని ఆర్టీసీ డీఎం యూ.రాజ్యలక్ష్మి అన్నారు. ఆశా స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి మేడారం వెళ్ల ఆర్టీసీ ఉద్యోగులకు ఉచితంగా వాటర్ బాటిళ్లను నిర్వహకులు డాక్టర్ మట్టా దయానంద్, విజయకుమార్ అందజేశారు. కార్యక్రమంలో డిపో ఉద్యోగులు, సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రయాణీకులు పాల్గొన్నారు.



మేడారం వెళ్లే భక్తులకు వాటర్ బాటిళ్లను అందజేస్తున్న డీఎం రాజ్యలక్ష్మి

ఖమ్మం ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన రమణమూర్తి

ఖమ్మంక్రైం, ఫిబ్రవరి16: ఖమ్మం నగర ఏసీపీగా ఎస్‌వీ రమణమూర్తి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల బదిలీల్లో భాగంగా ఇల్లెదు ఎస్‌డీపీవోగా ఉన్న ఆయన ఖమ్మం నగర ఏసీపీగా నియమితులయ్యారు. అనంతరం నగరంలోని సీపీ కార్యాలయానికి వెళ్లి పోలీసు కమిషనర్ సునీల్‌దత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 16: మైనర్ బాలికను మోసగించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చర్ల మండలం కుదునూరు ఆవాస ప్రాంతం బోటుగూడేనికి చెందిన మహేష్ అనే లారీ డ్రైవర్ మండల పరిధిలోని చిననల్లబల్లికి చెందిన ఓ మైనర్ బాలికను పెళ్లి పేరుతో వేధించాడు. మైనర్ బాలిక పెద్దమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

కూసుమంచి, ఫిబ్రవరి 16: మేడారం జాతరకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం చింతపల్లి గ్రామం సమీపంలో శుక్రవారం జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జీళ్లచెరువు గ్రామానికి చెందిన ముద్రబోయిన ఉమ(30) తల్లితండ్రులతో కలిసి మేడారం జాతరకు వాహనంలో వెళ్తుతుంది. మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం చింతపల్లి గ్రామం సమీపంలో వాహనంలో డీజీల్ అయిపోవడంతో ఆటోను వెనుక నుంచి నెట్టుకుంటూ వెళుతున్నారు. ఈక్రమంలో వెనుక నుంచి ఆమెను ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిందని కుటుంబసభ్యులు తెలిపారు.

ద్విచక్రవాహనం, కారు ఢీ

ఖమ్మంక్రైం, ఫిబ్రవరి16: నగరంలో ఇద్దరు యువకులు ఓ ద్విచక్రవాహనం చోరీచేసి పారిపోతుండగా ప్రమాదం జరిగిన సంఘటన శుక్రవారం తెల్లవారు జామున ఖమ్మం నగరంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నగరానికి చెందిన ఇద్దరు యువకులు బస్‌డిపో రోడ్డులోని ఓ ద్విచక్రవాహనం చోరీచేసి వెళ్తుండగా ఓకారును ఢీకొట్టినట్టు తెలిసింది. ఈప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలు కావడంతో స్థా నికులు వారిని ఆసుపత్రికి తరలించారు. కాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరి లో ఓ యువకుడు అక్కడి నుంచి పారిపోయినట్టు సమాచారం. ద్విచక్రవాహనం చోరీ చేసిన సంఘటన పోలీసులకు సమాచారం తెలియడంతో ఆసుపత్రికి వెళ్లి ఆ యువకు డిని స్టేషన్‌కు తరలించారు. ఈవిషయమై విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్య

అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 16: కుటుంబ సభ్యుల మందలింపుతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని అన్నపురెడ్డిపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అన్నపురెడ్డిపల్లికి చెందిన హింగ్ సతీష్(40) మద్యానికి బానిసై డబ్బులు వృథా చేస్తుదడంతో కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య పాల్పడ్డాడు. అతడిని గమనించి కుటుంబ సభ్యులు కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షాహీనా తెలిపారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

దుమ్ముగూడెం ఫిబ్రవరి 16: మండల పరిధిలోని లక్ష్మీనగరం నుంచి కొందరు వ్యక్తులు అక్రమంగా ఇసుక రవాణాను కొనసాగిస్తున్నారు. ఇసుక రవాణాను అడ్డుకునేందుకు తహసీల్దార్ లక్ష్మీపురం ఎస్బీఐ బ్యాంక్ పక్క నుంచి గోదావరి ఒడ్డుకు వెళ్లే దారిలో కందకాన్ని తీయించారు. వారం రోజుల్లోనే ఆ కందకాన్ని ఇసుక అక్రమణదారులు కందకాన్ని మట్టితో పూడ్చించారు. కాగా రెండు రోజుల నుంచి పెద్ద ఎత్తున్న ఇసుక రవాణా యథేచ్ఛగా కొనసాగిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. స్వయంగా రెవెన్యూ అధికారులు దగ్గరుండి తీయించిన కందకాన్ని స్మగ్లర్లు పూడ్చించడం వెనుక ముడుపులు చేతులు మారినట్లు ఆరోపణలు వినబడుతున్నాయి. ఈ విషయమై తహసీల్దార్ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా లక్ష్మీపురం ఇసుక ర్యాంపు వద్ద కందకాన్ని స్మగ్లర్లు పూడ్చించిన విషయం తనకు తెలియదని, ఇసుక అక్రమ తోలకలను అడ్డుకునేందుకు రెవెన్యూ సిబ్బందిని నియమించామని తెలిపారు.

అస్వస్థతకు గురై డిగ్రీ విద్యార్థి మృతి

కామేపల్లి, ఫిబ్రవరి16: వాంతులతో ఓ విద్యార్థి అస్వస్థతకు గురై మృతి చెందిన సంఘటన కామేపల్లి మండలం పింజరమడుగుతండలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కేళోత్ భద్రు, అచ్చమ్మ కుమారుడు కేళోత్ మురళి(22) డిగ్రీ ఫైనల్ ఇయర్ ఖమ్మంలోని ఓ ప్రైవేటు కళాశాలలో చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం నుంచి మురళికి వాంతులై ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

అనారోగ్యంతో విశ్రాంత ఈఈ కన్నుమూత

నేలకొండపల్లి, ఫిబ్రవరి16: పాల్వంచ కేటీపీఎస్‌లో పని చేసిన విశ్రాంత ఎక్జిక్యూటివ్ ఇంజనీర్(సివిల్) ఖమ్మం జిల్లా నేలకొండపల్లికి చెందిన కొంగర లలితా నాగరవి(62)మంగళవారం హైదరాబాద్‌లోని ఓప్రైవేటు వైద్యశాలలో మృతి చెందాడు. నాగరవి మృతదేహానికి టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు, సీపీఐ జిల్లా సభ్యుడు కర్నాటి భానుప్రసాద్, సీపీఎం మండల కార్యదర్శి కేవీరెడ్డి, ఏటుకూరి రామారావు, రామచంద్రాపురం సొసైటీ అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు గూడవల్లి రాంబ్రహ్మం, బీఆర్ఎస్ పట్టణ కార్యదర్శి గొలుసు రవిలు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

సార్లు రారు..చదువులు సాగవు

● 48 మంది విద్యార్థులకు ఉపాధ్యాయులు కరువు

● పట్టించుకోని ఉన్నతాధికారులు



ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

కరకగూడెం, ఫిబ్రవరి 16: ఆ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులకు ఒక్కరే విధులు నిర్వర్తిస్తున్నారు. ఆ ఉపాధ్యాయుడు కూడా పాఠశాలకు సరిగ్గా రాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని బట్టుపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5 తరగతిలలో విద్యను అభ్యసించే విద్యార్థులు 48మంది ఉన్నారు. పాఠశాలకు ఉపాధ్యాయులు రాకపోవడంతో విద్యార్థులు ఇష్టానుసారంగా ఆడుకుంటున్నారు. పాఠశాలకు ఉపాధ్యాయులను పంపించాలని శుక్రవారం పాఠశాల ఎదుట విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. అధికారులు స్పందించి ఉపాధ్యాయులను నియమించాలని కోరుతున్నారు.

డ్వాక్రా మహిళలకు టోకరా

● రూ.4లక్షలు స్వాహా చేసిన వీఓ

● వీఓ ఇంటి ఎదుట ఆందోళన

● కామేపల్లి మండల కేంద్రంలో ఘటన

కామేపల్లి, ఫిబ్రవరి 16: కొత్త రుణాల కోసం పాత రుణాలు చెల్లించాలని చెప్పి డ్వాక్రా మహిళ రుణాలు ఓ



కామేపల్లిలో గ్రామ దీపిక ఇంటి ఎదుట నిరసన చేస్తున్న మహిళలు

గ్రామ దీపిక స్వాహా చేసిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కామేపల్లి మండల కేంద్రంలోని గోపాలపురం కాలనీలోని సీరి గ్రూప్‌లో పది మంది మహిళ సభ్యురాలు ఉన్నారు. అయితే కొత్త రుణం కావాలంటే పాత రుణం చెల్లించాలని గ్రామ దీపిక శీలపాక ఇందిర గ్రూప్ సభ్యుల నుంచి పాత రుణ బాకీ, పొదుపు డబ్బులు కలిపి రూ. 4లక్షలు ఉన్నాయని వాటిని కడితే కొత్త రుణాలు వస్తాయని తెలిపింది. దీంతో డ్వాక్రా మహిళ వారి పాత బాకీలను, పొదుపు డబ్బులను అందరూ జమ చేసి రూ.4లక్షలు వీఓ ఇందిరకు గత ఎడాది డిసెంబర్ 30న ఇచ్చినట్లు తెలిపారు. అప్పటి నుంచి కాలయాపన చేస్తూ వచ్చిందని అన్నారు. గ్రూప్ సభ్యులు ఫిబ్రవరి 9న బ్యాంక్ వద్దకు వెళ్లి ఆరా తీస్తే బ్యాంక్ ఖాతాలో నగదు జమ చేయలేదని బ్యాంక్ అధికారులు తెలపడంతో ఆందోళన వ్యక్తం చేశారు. అదేరోజు నిలదీస్తే నేనే వాడుకున్న ఇప్పుడు లేవు ఐదు రోజుల తరువాత ఇస్తానని చెప్పి వారం గడుస్తున్న ఇవ్వడం లేదని వారు వాపోయారు. ఎంతకి డబ్బులు ఇవ్వకపోవడంతో గ్రూప్ సభ్యులు ఇందిర ఇంటి ఎదుట ఆందోళన చేపట్టారు. డబ్బులు ఇస్తేనే ఇక్కడి నుంచి వెళ్తామని భీష్మించుకుర్చున్నారు.

వైద్యశాలల నిర్వహణకు అనుమతులు తీసుకోవాలి

● డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సుకృత



తనిఖీలు చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ సుకృత

అశ్వారావుపేట టౌన్, ఫిబ్రవరి 16: వైద్యశాలల నిర్వహణకు అనుమతులు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సుకృత హెచ్చరించారు. శుక్రవారం అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో పలు ప్రైవేట్, డయగ్నస్టిక్ సెంటర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు ప్రకారం ఆస్పత్రులు, ల్యాబ్‌లో అన్ని సదుపాయాలు ఉండాలని ఆదేశించారు. రోగుల పట్ల వైద్యులు సానుకూలంగా ఉండాలని సూచించారు. అనుమతులు లేకుండా ఆసుపత్రులు నిర్వహిస్తే శాఖపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట మాస్ మీడియా ఆఫీసర్ ఫైజ్‌మొహిదీన్, డిప్యూటీ ఎస్ఓ ఇనాక్, హెల్త్ ఎడ్యుకేటర్ బేబి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ సడక్ బంద్ ప్రశాంతం

- స్వచ్ఛందంగా బంద్ పాటించిన వ్యాపార, వాణిజ్య వర్గాలు
- ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ర్యాలీలు
- ఆందోళనలో పాల్గొన్న కాంగ్రెస్ సహా వామపక్షాలు
- మంచుకొండ వద్ద రాస్తారోకోతో నిలిచిపోయిన ఖైదీల తరలింపు వాహనం

ఖమ్మం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేంద్ర ప్రభుత్వ కార్మిక రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా శుక్రవారం జిల్లాలో బంద్‌తోపాటు రాస్తారోకోలు, నిరసన ర్యాలీలు నిర్వహించారు. ఉదయమే వామపక్ష, కాంగ్రెస్, ప్రజాపంథా పార్టీల నాయకులు, కార్యకర్తలు, కార్మిక రైతు సంఘాల నేతలు ఆయా పార్టీల జెండాలు చేతపట్టి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఖమ్మంతో పాటు మునిసిపల్ పట్టణాలు, మండల కేంద్రాల్లో ర్యాలీలు, రాస్తారోకోలో సాగించారు. బస్సులు, ఆటోలను తిరగనివ్వలేదు. అన్ని వ్యాపార సంస్థలను మూసివేశారు.

కాగా జిల్లా వ్యాప్తంగా సీపీఎం, సీపీఐ, ప్రజాపంథా కాంగ్రెస్, టీడీపీ తదితర రాజకీయ పార్టీలు కార్మిక సంఘాలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో ఉదయం బంద్ నిర్వహించారు. జిల్లా కేంద్రం ఖమ్మంలో ఆర్టీసీ బస్సులు నిలిపివేశారు. దీంతో బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. పట్టణంలో దుకాణాలు బంద్ నిర్వహించారు. జిల్లాలోని మండల కేంద్రాల్లో కూడా బంద్‌పాటించారు. వామపక్షాల నేతలు రోడ్లపై రాస్తారోకో నిర్వహించి కేంద్ర ప్రభుత్వ విధానాలను మోదీ నిర్ణయాలను ఎండగట్టారు. కార్పొరేట్ శక్తులకు కేంద్ర ప్రభుత్వం మద్దతుగా నిలిచి కార్మికుల హక్కుల హరించి వేస్తున్నారని, రైతులపై నిర్బంధకాండ అమలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ ఆందోళనలో సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, ప్రజాపంథా జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వరరావు సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ పాల్గొన్నారు. ప్రదాని మోదీ తీసుకుంటున్న కార్మిక, రైతాంగ వ్యతిరేక నిర్ణయాలను తీవ్రంగా విమర్శించారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రైతులకు, కార్మికులకు వ్యతిరేకంగా పరిపాలన సాగిస్తున్నదని పేర్కొన్నారు.

మంచుకొండలో ఉద్రిక్తత

రఘునాధపాలెం మండలం మంచుకొండలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. మంచుకొండ వద్ద సీపీఎం, సీపీఐ, ప్రజాపంథా, కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సార్వత్రిక గ్రామీణ బంద్ సందర్భంగా రాస్తారోకో నిర్వహించారు. ఈ బంద్‌కు గ్రీన్‌ఫీల్డ్ నిర్వాసిత రైతులు కూడా మద్దతు ప్రకటించారు. దీంతో రాస్తారోకో జరుగుతుండగా ఖమ్మం నుంచి భద్రాచలం కోర్టుకు ఖైదీలను తీసుకువెళ్తున్న పోలీసు వాహనం రాస్తారోకోలో నిలిచిపోయింది. దీంతో పోలీసులకు రాస్తారోకో చేస్తున్న వారికి మధ్య వాగ్వాదం చొటు చేసుకొని ఉద్రిక్తతకు దారి తీసింది. రఘునాథపాలెం ఎస్‌ఐ సురేష్ ఇరుపక్షాలను ఒప్పించి రాస్తారోకోను బంద్ చేయించారు. పోలీసులు నచ్చచెప్పడంతో రైతులు, ఆందోళనకారులు శాంతించి ఖైదీల వాహనానికి దారి ఇచ్చారు.

ఈసందర్భంగా గ్రీన్‌ఫీల్డ్ నిర్వాసిత రైతులు దేశానికి అన్నం పెట్టే రైతులం మేము.. ఏడాదికి మూడు పంటలు సాగు చేస్తున్న బంగారం లాంటి భూములను గ్రీన్ ఫీల్డ్ హైవే పేరుతో రైతుల నుంచి కేంద్ర ప్రభుత్వం గుంజుకుంటోంది. మా నిరసనకు మీరు సహకరించండి లేదంటే భేడీలు వేస్తారా అంటూ ఓ గ్రీన్ ఫీల్డ్ బాధిత రైతు పోలీసు అధికారి ఎదుట తన రెండు చేతులను చూపారు.



సత్తుపల్లి వేంసూర్ రోడ్‌లో మూసిన పెట్రోల్ బంక్




అళ్లపల్లిలో ఆర్టీసీ బస్సును అడ్డుకున్న అఖిలపక్ష నాయకులు

కేంద్ర ప్రభుత్వ విధానాలు ప్రమాదకరం

- వామపక్షాల నేతల ధ్వజం
- ఖమ్మం బైపాస్ రోడ్డులో రాస్తారోకో

ఖమ్మం సంక్షేమ విభాగం, ఫిబ్రవరి 16: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక, రైతు, కూలీ, ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ దేశ భవిష్యత్‌కే ప్రమాదం తీసుకొచ్చే నిర్ణయాలను తీసుకుంటున్నదని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, ప్రజాపంథా జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వరరావు విమర్శించారు. సార్వత్రిక బంద్‌లో భాగంగా శుక్రవారం ఖమ్మం బైపాస్ రోడ్డులో వామపక్షాలు, ప్రజాసంఘాలు ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టాయి. తెల్లారు జాము నుంచే ఆర్టీసీ డిపో ప్రధాన రహదారులపై ప్రజాసంఘాల నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టి వాహనాలను అడ్డగించారు.

ఈ సందర్భంగా వామపక్షాల నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల నిర్ణయాలు తీసుకోవటం ద్వారా కార్మికుల హక్కులకు భంగం కలుగుతుందన్నారు. ప్రఖ్యాతి పొందిన దేశీయ ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు తాకట్టు పెడ్తున్నారని ఆరోపించారు. కార్పొరేటీకరణ వల్ల కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని, వ్యవసాయ రంగాన్ని దశల వారీగా ప్రైవేటీకరణ చేసేలా కార్పొరేట్ శక్తులను వ్యవసాయరంగంలోకి కేంద్ర ప్రభుత్వం దించే కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. ఈ ఆందోళనలో సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సీపీఎం జిల్లా ఇంచార్జీ కార్యదర్శి యర్రా శ్రీకాంత్, బండి పద్మ, వై విక్రమ్, దొండపాటి రమేశ్, శింగు నర్సింహారావు, జానిమియా, రామయ్య, ఆవుల అశోక్, సీవై పుల్లయ్య, శిరోమణి, ఝాన్సీ, కోలేటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



రోడ్డుపై బైఠాయించిన వామపక్ష నేతలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో...

కొత్తగూడెం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ విపక్షాలు, రైతు సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు శుక్రవారం సార్వత్రిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విజయవంతమైంది. ప్రభుత్వ ప్రైవేటు రంగ సంస్థలు, బ్యాంకులు, ఆర్టీసీ, ప్రజారవాణా, వ్యాపార, వాణిజ్య సంస్థలు మూతపడ్డాయి. ఉద్యోగులు, కార్మికులు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు. బంద్‌ను పురస్కరించుకుని సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, బీఆర్ఎస్, న్యూ డెమోక్రసీ, ప్రజాపంథా, టీజేఎస్ పార్టీలు, అనుబంధ కార్మిక, రైతు, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో కొత్తగూడెం పట్టణంలోని ఓల్డ్ డిపో నుంచి బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సభా వేదిక వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. సభను ఉద్దేశించి సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, కాంగ్రెస్ జిల్లా నాయకుడు జలీల్ పాషా, ప్రజాపంథా జిల్లా నాయకుడు కెచ్చల రంగయ్య, న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు కందగట్ల సురేందర్, ఎల్.విశ్వనాథం, ముద్దా భిక్షం, బీఆర్ఎస్ నాయకుడు శంకర్ రెడ్డి మాట్లాడారు.



భద్రాచలంలో కార్మికుల ప్రదర్శన

ముగిసిన భక్తరామదాసు జయంత్యుత్సవాలు



భక్తి సంగీతం ఆలపిస్తున్న బృందం

భద్రాచలం, ఫిబ్రవరి 16: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ భద్రాచల రామదాసు 391వ జయంతి ప్రయుక్త వాగ్గేయకారోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఇందులో భాగంగా వాగ్గేయకారోత్సవాలు నిర్వహిస్తున్న చిత్రకూట మండపం వద్ద ఉదయం పలువురు భక్తి సంగీత కళాకారుల తమ గాన మాధుర్యంతో భక్తరామదాసు కీర్తనలను ఆలపించారు. సాయంత్రం భక్తరామదాసు పదో తరం వారసులు కంచర్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో అమృత వర్షిణి మ్యూజిక్ అకాడమీ నిర్వహించిన అలివి రెడ్డి ఉదయభాస్కర్ శిష్య బృందం 60 మంది గాయని గాయకులచే రామదాసు కీర్తనలను ఆలపించారు.

పాలకమండలి సమావేశానికి సిద్ధంకావాలి

- భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్

భద్రాచలం, ఫిబ్రవరి 16: త్వరలో జరగబోయే ఐటీడీఏ పాలకవర్గ సమావేశానికి ఎటువంటి అసౌకర్యం, లోటుపాట్లు లేకుండా ఎజెండా ప్రకారం అప్పగించిన పనులను సమర్థవంతంగా నిర్వహించి నివేదికలతో సిద్ధంగా ఉండాలని భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ అన్నారు. శుక్రవారం తన చాంబర్‌లో ఐటీడీఏ కార్యాలయంలో వివిధ విభాగాలలో పని చేస్తున్న యూనిట్ అధికారులతో పీవో సమీక్ష నిర్వహించారు. బడ్జెట్‌కు సంబంధించిన ప్రపోజల్స్ వెంటనే పై అధికారులకు నివేదించి బడ్జెట్ తెప్పించుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో ఏపీవో జనరల్ డేవిడ్‌రాజు, డీడీ మణెమ్మ, ఈఈ తానాజీ, ఎస్వో సురేష్ బాబు, జీసీసీ డీఎం విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

జాఫర్ బావిని సందర్శించిన తుమ్మల యుగంధర్



జాఫర్ బావి అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న తుమ్మల యుగంధర్

ఖమ్మం సాంస్కృతికం, ఫిబ్రవరి 16: జాఫర్ బావి అభివృద్ధి పనులను కాంగ్రెస్ నేత తుమ్మల యుగంధర్ శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన జాఫర్ బావి ప్రాంతమంతా కలియదిరిగి పరిశీలించారు. అభివృద్ధి పనులను మరింత వేగంగా పూర్తి చేసి ఖమ్మం పర్యాటక ఖ్యాతి ఇనుమడించే చర్యలకు సహకరించాలని కోరారు. వెయ్యేళ్ల ఘనత సొంతం చేసుకున్న ఖమ్మం ఖిల్లాలో అంతర్భాగమైన జాఫర్‌బావులకు భూగర్భజలాలను పరిరక్షించిన చరిత్ర, పట్టణ దాహార్తి తీర్చిన చరిత్ర ఉన్నాయన్నారు. నిర్మాణపరంగా కూడా అత్యంత కళాత్మకంగా ఉండి పర్యాటక ఖ్యాతిని సొంతం చేసుకుందని అన్నారు. జాఫర్ బావుల పూర్వ వైభవం సాధనకోసం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక శ్రద్ధతో ప్రణాళికలు చేపట్టారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ చొరవ ఫలితంగా బావులకు పూర్వ వైభవం ఏర్పడబోతోందన్నారు. యుగంధర్ వెంట నగర కాంగ్రెస్ నాయకులు మిక్కిలినేని నరేందర్, మహ్మద్ ఆరిఫ్, ఎండీ ఖాదర్‌బాబా, కమర్తపు మురళి, సాదిక్ సందర్శించారు.

ముగిసిన జాతీయ సదస్సు

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 16: మండల పరిధిలోని మద్దులపల్లిలోని సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ గురుకుల పాఠశాలలో రెండు రోజులుగా 'అప్లికేషన్స్ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ మ్యాథమెటిక్స్' అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. రాష్ట్ర సాంఘిక సంక్షేమ కళాశాలల జాయింట్ సెక్రటరీ జి.నిరూప సెమినార్‌ను ఉద్దేశించి వర్చువల్‌గా మాట్లాడారు. విద్యార్థులకు సదస్సు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాలల ఓఎస్‌డీ ఆర్ యశోలత, ప్రొఫెసర్ చందులాల్, సాంబశివరావు, శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ఝాన్సీరాణి పాల్గొన్నారు.

ఎరువుల గోదాం తనిఖీ

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 16: మండల పరిధిలోని ముత్తగూడెంలోని ఫెర్టిలైజర్ గోదాంను అసిస్టెంట్ కలెక్టర్ మయాలీక్ సింగ్, జిల్లా వ్యవసాయ అధికారి ఎం. విజయనిర్మల శుక్రవారం తనిఖీ చేశారు. డీలర్ షాపులకు కేటాయింపుల గురించి అడిగి తెలుసుకున్నారు. రికార్డులను, స్టాక్‌ను పరిశీలించారు. అనంతరం ముత్తగూడెంలో వర్మీకంపోస్టు తయారీని పరిశీలించారు.

అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యేలు

- నియోజకవర్గాల సమస్యలు ప్రస్తావించిన వైరా, ఇల్లెందు శాసనసభ్యులు

వైరా, ఫిబ్రవరి 16: నియోజకవర్గంలోని కీలక సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ గళమెత్తారు. శుక్రవారం అసెంబ్లీలో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ప్రసంగించారు. సింగరేణి నిధులతో కారేపల్లి మండలం సహా నియోజకవర్గంలోని అన్ని మండలాలను సమగ్రాభివృద్ధి చేయాలని కోరారు. బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ జయంతికి ప్రభుత్వం సెలవు దినం ప్రకటించినందున సీఎం రేవంత్‌రెడ్డికి, ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంలో చెప్పుకోదగిన పట్టణ ప్రాంతాలు, పరిశ్రమలు లేవన్నారు.

సీతారామ నీటితో నియోజకవర్గంలోని ఐదుమండలాల్లోని చెరువులు, కుంటలను నింపాలని కోరారు. వైరా రిజర్వాయర్‌లో ఎప్పుడూ 18అడుగుల నీటి నిల్వ ఉంచాలని, సాగునీటి అవసరాలకు నీరు సరిపోనందున రిజర్వాయర్ సామర్థ్యం పెంచాలని విజ్ఞప్తి చేశారు. కుడి, ఎడమకాల్వలను ఆధునికీకరించాలని కోరారు. కొణిజర్ల, ఏన్కూరు మండలాల నుంచి సాగర్‌కాల్వ ప్రవహిస్తున్నప్పటికీ ఇక్కడి భూములకు సరిగా నీరందడం లేదని, నేరుగా ఆంధ్రాకు నీటిని తరలిస్తున్నందున రెండు మండలాల్లో ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీరందించాలనికోరారు.

జూలూరుపాడులో 30పడకల ఆసుపత్రికి నిర్మించి అవసరమైన సిబ్బందిని నియమించినప్పటికీ ఇంతవరకు దాన్ని ప్రారంభించలేదన్నారు. వెంటనే దాన్ని అప్‌గ్రేడ్ చేసి వినియోగంలోకి తేవాలన్నారు. వైరాలో వందపడకల ఆసుపత్రి, సింగరేణిలో 30పడకల ఆసుపత్రిని నిర్మించాలని కోరారు. అంతర్జాతీయ స్థాయి స్కూల్‌ను, వ్యవసాయ కాలేజీ, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, నర్సింగ్ కాలేజీ, ఐటీఐ, పాలిటెక్నిక్ కాలేజీలు, స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు.

గత ప్రభుత్వం ఐటీడీఏ, ఎస్సీ కార్పొరేషన్లను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం పోడుపట్టాలు ఇచ్చిన వారందరికి ఐటీడీఏ ద్వారా బోర్లు వేసి మోటార్లు ఇవ్వాలని కోరారు. సింగరేణి పుట్టినిల్లుగా ఉన్న కారేపల్లి మండలాన్ని, వైరా నియోజకవర్గాన్ని సింగరేణి నిధుల ద్వారా సమగ్రాభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.



ప్రసంగిస్తున్న వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

పోడు రైతులను ఆదుకోవాలి

ఏజెన్సీలో పోడు భూములను సాగుచేస్తున్న గిరిజన రైతులను అటవీ శాఖ అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు .శుక్రవారం శాసనసభ సమావేశాల్లో ఎమ్మెల్యే కనకయ్య మాట్లాడుతూ ఏజెన్సీలో గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇచ్చినప్పటికి ఫారెస్ట్ అధికారులు అడ్డంకులు కల్పిస్తున్నారని తెలిపారు. పోడు భూముల రైతులకు కరెంట్ సౌకర్యం లేదని విద్యుత్ సౌకర్యాల ఏర్పాటుకు, మోటార్లు ఏర్పాటు చేసుకోవడానికి పోడు రైతులకు అవకాశం కల్పించాలని కోరారు. పోడు రైతులు ట్రాక్టర్లతో భూములను దున్నుకుంటుంటే వాటిని ఫారెస్ట్ అధికారులు సిజ్ చేస్తున్నరని ప్రభుత్వానికి వివరిం చారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రి కొమటిరెడ్డి వెంకటొరెడ్డి మాట్లాడుతూ పోడురైతులకు ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు.

భద్రాద్రికి రథ సప్తమి శోభ

- చంద్రప్రభ వాహనంపై స్వామి వారికి తిరువీధి సేవ

భద్రాచలం/ ఎర్రుపాలెం, ఖమ్మం సాంస్కృతికం, ఫిబ్రవరి 16: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో స్వామి వారికి శుక్రవారం రథ సప్తమిని పుస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిత్రకూట మండపంలో వైదిక సిబ్బంది స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి పాల్గొన్నారు. అనంతరం స్వామి వారికి అందంగా అలంకరించిన చంద్రప్రభ వాహనంపై తిరువీధి సేవ నిర్వహించారు. ఎర్రుపాలెం మండలంలోని జమలాపురం శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో రథసప్తమి సందర్భంగా శుక్రవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. శ్రీవారికి లక్ష పుష్పార్చన, ప్రత్యేక అర్చన అలంకారాలతో విశేష పూజలు నిర్వహించారు. ఖమ్మంలోని గుంటుమల్లేశ్వర దేవాలయంలో సూర్యదేవునికి ప్రత్యేక పూజలుచేశారు.



తిరువీధి సేవలో రామయ్య

గ్రామాల అభివృద్ధే లక్ష్యం: ఎంపీ నామా



కొత్తగూడెం, ఫిబ్రవరి 16: గ్రామాల అభివృద్ధే తన లక్ష్యమని, గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం కోసం తన నిధుల నుంచి రూ.1,17,50,500 కేటాయించినట్లు ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు, బీఆర్ఎస్ లోక్‌సభ పక్ష నేత నామా నాగేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మారుమూల గ్రామాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని స్థానిక ప్రజాప్రతినిధులు, బడుగు బలహీన వర్గాలు, పేద ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకుని ఈ నిధులను కేటాయించినట్లు తెలిపారు. జిల్లాలోని అశ్వారావుపేట, చంద్రుగొండ, దమ్మపేట, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ మండలాలకు చెందిన గ్రామాల్లో సిమెంటు రోడ్లు, కల్వర్టులు, అంగన్వాడీ కేంద్రాలు, స్కూళ్ళ ప్రహరీ గోడల నిర్మాణాలకు ఈ నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. అశ్వారావుపేట మండలం వినాయకపురం, దురదపాడు, గుమ్మడివల్లి, మల్లాయిగూడెం, చంద్రుగొండ మండలం మొద్దుకూరు, పోకలగూడెం, తిప్పనపల్లి, రావికంపాడు, దమ్మపేట మండలం ఆర్లపెంట, పట్వారీగూడెం, అంకంపాలెం, చుంచుపల్లి మండలం విద్యానగర్, త్రీఇంక్లైన్, పునగడప, లక్ష్మిదేవిపల్లి మండలం సంజయ్‌నగర్, శ్రీనగర్ కాలనీ తదితర గ్రామాల్లో తన ఎంపీ నిధుల ద్వారా పనులను చేపట్టనున్నట్లు నామా పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు భద్రాద్రి జిల్లాలోని గ్రామాల అభివృద్ధికి తన ఎంపీ నిధలను కేటాయించి ఖర్చు చేస్తున్నట్లు ప్రకటించారు.

నెగ్గుతుందా.. వీగుతుందా..

- అవిశ్వాసంపై పావులు కదుపుతున్న నాయకులు
- పంతం నెగ్గించుకొనేందుకు వ్యూహరచన

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 16: కొత్తగూడెం పురపాలక పాలకవర్గ అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టిన కౌన్సిలర్లు పరీక్ష నెగ్గేందుకు భారీ ఎత్తున ముడుపులు చేతులు మారుతున్నాయనే ప్రచారం జరుగుతోంది. విశ్వాస పరీక్ష నెగ్గి పీఠం దక్కించుకొనేందుకు కొంతమంది కౌన్సిలర్లు కారు పార్టీ నుంచి అధికార కాంగ్రెస్ వైపు అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే కొత్తగూడెం మునిసిపాలిటీలో పలువురు కౌన్సిలర్ల భర్తలు రాజకీయ పావులు కదుపుతున్నారు. కొత్తగూడెం మునిసిపాలిటీలో చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మీపై సొంత పార్టీ కౌన్సిలర్లే అవిశ్వాస తీర్మానానికి సిద్ధమయ్యారు.

మారుతున్న సమీకరణలు

ఈనెల 19న అవిశ్వాస తీర్మానంపై సమావేశం జరుగనుంది. దీంతో గత రెండు, మూడురోజులుగా రాజకీయ సమీకరణాలు మారిపోతున్నాయి. అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా సంతకాలు చేసిన కొంతమంది కౌన్సిలర్లు వేరే శిబిరంలోకి వెళ్లిపోయారనే ప్రచారం సాగుతోంది. కొత్తగూడెం మునిసిపాలిటీలో 36వార్డులకుగానూ బీఆర్ఎస్‌కి 24, సీపీఐకి 8, కాంగ్రెస్‌కు ఒకటి, ఇరువురు స్వతంత్రులున్నారు. గత శాసనసభ ఎన్నికల్లో మారిన రాజకీయ పరిస్థితుల కారణంగా సీపీఐకి చెందిన ఐదుగురు కౌన్సిలర్లు బీఆర్ఎస్‌లో చేరడంతో బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ల బలం 29కి చేరింది. దీంతో విశ్వాస పరీక్ష సమీపిస్తుండటంతో చైర్‌పర్సన్ సీటు కోసం పోటీపడుతున్న ఇరువురు కౌన్సిలర్లను ప్రలోభాలకు గురిచేసే పనిలో నిమగ్నమయ్యారు.



కొత్తగూడెం మునిసిపాలిటీ కార్యాలయం

ఎత్తులకు పైఎత్తులు

ఇప్పటికే మునిసిపల్ చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్న కాపు సీతాలక్ష్మి తనకు అనుకూలమైన కౌన్సిలర్లు చేజారిపోకుండా రహస్య ప్రాంతానికి తరలించినట్లు సమాచారం. ఆమె వ్యతిరేక వర్గీయులు అధికార పార్టీ అండదండల కోసం ఇటీవల రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

విశ్వాస పరీక్ష సమయంలో తమకు అనుకూలంగా పరిస్థితులు మార్చుకునే ప్రయత్నం చేస్తున్నట్లు ప్రచారం సాగుతుంది. ఇరువర్గాల ప్రతినిధులు తమకు అనుకూలంగా ఉండేందుకు కౌన్సిలర్లకు కాసుల వర్షం కురిపిస్తున్నారనే సొంత పార్టీకి చెందిన నాయకులే బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. కాగా మునిసిపల్ పాలకవర్గం అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి కౌన్సిలర్లంతా విశ్వాస పరీక్ష కోసం ప్రయత్నిస్తుండటంతో కొత్తగూడెం మునిసిపాలిటీలో పరిపాలన పడకేసినట్లయింది.

ఐదుగురు ఎన్డీ సాయుధ నక్సల్స్ అరెస్ట్

- రాష్ట్ర కార్యదర్శి సహా ఇద్దరు దళకమాండర్లు..
- మందుగుండు సామగ్రి స్వాధీనం
- వెల్లడించిన భద్రాద్రికొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజ్

ఇల్లెందు, ఫిబ్రవరి 16: ఇల్లెందు మండలం పూసపల్లి అడవుల్లో శుక్రవారం న్యూడెమొక్రసీ (పెద్దచంద్రన్న వర్గం) రాష్ట్ర కార్యదర్శి కురసం వంజయ్య ఆలియాస్ అశోక్‌తో సహా ఐదుగురు సాయుధ నక్సల్స్‌ను అరెస్టు చేసినట్టు ఎస్పీ రోహిత్‌రాజ్ శుక్రవారం రాత్రి ప్రకటన విడుదల చేశారు.

పూసపల్లి అడవుల్లో సాయుధ నక్సలైట్ల దళాలు సమావేశాలు నిర్వహిస్తున్నట్టు సమాచారం అందడంతో శుక్రవారం తెల్లవారు జాము నుంచి పోలీసు బలగాలు గాలింపు చర్యలు చేపట్టాయని తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు జరిపిన దాడుల్లో మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం రామగుండాల గ్రామానికి చెందిన అజ్ఞాత దళ కమాండర్, న్యూడెమొక్రసీ రాష్ట్ర కార్యదర్శి కురసం వంజయ్య అలియాస్ అశోక్, ఎన్డీకి చెందిన మరో దళ కమాండర్, మహబూబాబాద్ జిల్లా కొత్తగూడెం మండలం ఎంచనగూడెం గ్రామానికి చెందిన దనసరి సమ్మయ్య అలియాస్ గోపన్న, అదే జిల్లాకు చెందిన బయ్యారం మండలం ఇర్సులాపురం గ్రామానికి చెందిన మరో దళ కమాండర్ శనగపొంగుల ముత్తయ్య అలియాస్ పుల్లన్న సాయుధ దళాల కొరియర్లుగా పని చేస్తున్న బయ్యారం మండల కేంద్రానికి చెందిన ఎస్కే మదార్‌సాహెబ్, ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జిజ్జులరావుపేట గ్రామానికి చెందిన కలకొండ సురేష్‌ను అరెస్టు చేసినట్టు ఎస్పీ తెలిపారు. వీరి వద్ద నుంచి ఒక పిస్టల్, 303 తుపాకీకి చెందిన 16 రౌండ్ల బుల్లెట్లు, ఐదు జిలిటెన్ స్టిక్స్, పది డిటోనేటర్లు, నాలుగు కిట్‌బ్యాగులు, విప్లవ సాహిత్యం స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు.

కాగా పోలీసు దాడుల్లో అజ్ఞాత నక్సలైట్లు గురుగుంట్ల దేవిరెడ్డి అలియాస్ ఎల్లయ్య, నాయిని కొమరయ్య, అలియాస్ కొండన్నతో పాటు క్రాంతి, దనసరి సురేష్, అబ్బర్ల రాజయ్య, ఉపేందర్ అలియాస్ ఉమర్‌తో పాటు మరికొందరు పారిపోయారని ఎస్పీ తెలిపారు.

జనసీవన స్రవంతిలోకి రండి: ఎస్పీ

పారిపోయిన నక్సలైట్ల కోసం గాలిస్తున్నట్లు ఎస్పీ రోహిత్‌రాజ్ తెలిపారు. ఆయుధాలతో సంచరిస్తే సహించబోమని ఆయన హెచ్చరించారు. అజ్ఞాత నక్సలైట్లు పోలీసులకు లొంగిపోవాలని జనజీవన స్రవంతిలోకి వచ్చి ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేయాలని ఆయన స్పష్టంచేశారు. సమావేశమైన నక్సలైట్లు ప్రభుత్వంపై సాయుధపోరాటం చేయాలని సన్నాహాలు చేస్తున్నట్టు పట్టుబడిన నక్సల్స్ వివరించారని తెలిపారు.



భద్రాద్రి కొత్తగూడెం

ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

శనివారం 17 ఫిబ్రవరి 2024 | 6 | కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట

కమ్మసేవా సంఘం భవన నిర్మాణానికి రూ.15 లక్షల విరాళం



చెక్కు అందజేస్తున్న దాతలు

భద్రాచలం, ఫిబ్రవరి 16: భద్రాచలంలోని శ్రీ సీతారామ కమ్మవారి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న భక్తుల వసతి సముదాయానికి ఏపీలోని విజయవాడకు చెందిన పవర్‌మెక్ ప్రతినిధులు సజ్జల కిషోర్‌బాబు రూ.15లక్షలు విరాళంగా అందజేశారు. ఈ నిధులు రామాలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం నిర్మించే భవన నిర్మాణ పనులకు ఉపయోగించాలని కోరారు. అలాగే చర్ల మండలం ఎర్రగడ్డ గ్రామానికి చెందిన కొసరాజు నరహరి జ్ఞాపకార్థం కొసరాజు హరిచరణ్‌కుమార్ సైతం భవన నిర్మాణ పనులకు రూ.2.50 లక్షలు విరాళంగా అందజేశారు. ఈకార్యక్రమంలో కోనేరు చిన్ని, అడుసుమిల్లి జగదీష్, చావా లక్ష్మీనారాయణ, మోతుకూరి వీరయ్య, బొడ్డపాటి రామారావు, చల్లగుళ్ల నాగేశ్వరరావు, గంగినేని కిరణ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు ఊడిగం చేస్తున్న బీజేపీ

- దేశ సంపదను దోచిపెడతామంటే చూస్తూ ఊరుకోం..
- కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తాం
- వామపక్షాలు, విపక్షాల జిల్లా నేతలు
- జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ
- సార్వత్రిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్ విజయవంతం

కొత్తగూడెం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ప్రజా, రైతు, ఉద్యోగ, కార్మిక విధానాలకు వ్యతిరేకంగా, ప్రజల భాగస్వామ్యంతో ఉద్యమాలను ఉధృతం చేసి కేంద్రానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తామని వామపక్ష, విపక్షాల నేతలు స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు, మతతత్వ విధానాలను నిరసిస్తూ వామపక్ష, విపక్షాలు, రైతు సంఘాలు శుక్రవారం చేపట్టిన సార్వత్రిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో విజయవంతమైంది. బంద్‌ను పురస్కరించుకుని సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, బీఆర్ఎస్, న్యూ డెమోక్రసీ, ప్రజాపంథా, టీజేఎస్ పార్టీలు, అనుబంధ కార్మిక, రైతు, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని ఓల్డ్ డిపో నుండి బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సభా వేదిక వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సభలో నాయకులు మాట్లాడుతూ మోదీ ప్రజలకోసం కాకుండా, కార్పొరేట్ సంస్థల కోసమే పనిచేస్తున్నారనీ, అదానీలు, అంబానీలు, అమేజాన్, వాల్‌మార్ట్ వంటి కార్పొరేట్ సంస్థలకు లాభాలు చూకూర్చే చట్టాలు చేస్తూ కార్మికులు, రైతులు, ప్రజల మెడకు ఉరిబిగించే చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఆక్స్ఫామ్ నివేదిక ప్రకారం దేశంలో 80 కోట్ల మంది దారిద్ర్య రేఖకు దిగువకు చేరడం కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాలే కారణమన్నారు. ప్రభుత్వ రంగాలను నిర్వీర్యం చేస్తూ కార్మికులు, ఉద్యోగులు, రైతులపై ముప్పేట దాడికి పాల్పడుతున్న మోదీకి తగిన రీతిలో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్‌పాషా, సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, కాంగ్రెస్ జిల్లా నాయకులు జలీల్ పాషా, ప్రజాపంథా జిల్లా నాయకులు కెచ్చల రంగయ్య, న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు కందగట్ల సురేందర్, ఎల్ విశ్వనాథం, ముద్దా భిక్షం, బీఆర్ఎస్ నాయకులు శంకర్ రెడ్డి సభలో మాట్లాడారు. నరాటి ప్రసాద్, వీరన్న, పి సతీష్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు, నాయకులు సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, భూక్యా శ్రీనివాస్, గెద్దాడి నగేష్, కె రత్నకుమారి, ఏజే రమేష్, అన్నవరపు సత్యన్నారాయణ, మంద నర్సింహారావు, భూక్యా రమేష్, లిక్కి బాలరాజు, గౌని నాగేశ్వరరావు, కంబాల కృష్ణ, వీరభద్రం, ఆదినారాయణ, బానోత్ రమేష్, మల్లికార్జున్, వై గోపాలరావు, జాటోత్ కృష్ణ, సంధ్య, లక్ష్మి, బాలరెడ్డి, అంతయ్య, గోనే మణి, విజయలక్ష్మి, వెంకటరమణ, బత్తుల సురేష్, గోనే సురేష్, సర్వేశ్, రవి చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా వామపక్ష, కాంగ్రెస్, టీడీపీ, బీఆర్ఎస్ పార్టీల నాయకులు, వివిధ కార్మిక సంఘాల నాయకులు సమ్మెలో పాల్గొన్నారు.



కొత్తగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



జూలూరుపాడులో..

సార్వత్రిక సమ్మె విజయవంతం

- బంద్ నిర్వహించిన పార్టీలు, సంఘాలు
- నిర్మానుష్యంగా వీధులు

నెట్‌వర్క్: కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వామపక్షాల జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రశాంతంగా కొనసాగింది. ఈ కార్యక్రమాల్లో వివిధ పార్టీలు, సంఘాల నాయకులు పాల్గొన్నారు. బంద్‌ను విజయవంతం చేశారు.



భద్రాచలం ఆందోళనలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య



ఇల్లెందులో ర్యాలీ



దుమ్ముగూడెంలో ఆందోళన



సుజాతనగర్‌లో..



మణుగూరులో ఆందోళన



అశ్వాపురంలో కార్మికుల ర్యాలీ

జడ్పీ సీఈవోగా ప్రసూనా రాణి, కొత్తగూడెం మునిసిపల్ కమిషనర్‌గా శేషు బాధ్యతల స్వీకరణ





కలెక్టర్‌కు పూలమొక్కను అందజేస్తున్న జడ్పీ సీఈవో, మునిసిపల్ కమిషనర్

కొత్తగూడెం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : జడ్పీ సీఈఓగా బాధ్యతలు చేపట్టిన ఎస్ ప్రసూనా రాణి, కొత్తగూడెం మున్సిపల్ కమీషనర్‌గా బాధ్యతలు చేపట్టిన శేషు శుక్రవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలని ఐడీఓసీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యతల మేరకు కలిసి కట్టుగా పని చేసి జిల్లా ప్రజలకు సేవలు అందించాలని అన్నారు.

బాధ్యతలు స్వీకరించిన మణుగూరు డీఎస్పీ, సీఐ..



డీఎస్పీ రవీందర్‌రెడ్డి

మణుగూరుటౌన్, ఫిబ్రవరి 16: మణుగూరు సబ్ డివిజన్ పోలీస్ అధికారిగా రవీందర్‌రెడ్డి, సీఐగా సతీష్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మణుగూరుకు చెందిన ప్రముఖులు, వ్యాపార వర్గాల సభ్యులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులతో పాటు తదితరులు డీఎస్పీ, సీఐలకు స్వాగతం పలుకుతూ శుభాకాంక్షలు తెలిపారు. డీఎస్పీ రవీందర్‌రెడ్డి మాట్లాడారు. మణుగూరు సబ్ డివిజన్‌లోని అశ్వాపురం ఎస్ఐగా పూర్తికాలం పనిచేసానన్నారు. సబ్ డివిజన్‌లోని పోలీస్ అధికారులను, సిబ్బందిని సమన్వయం చేస్తూ లాఅండ్‌ఆర్డర్‌ను అమలు పరిచేందుకు కృషి చేస్తానన్నారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, న్యాయవాది విజయరావు, ఎస్‌కేటీ గ్రూప్స్ అధినేత దోసపాటి విచ్చేశ్వరరావు, మేము సైతం మిత్రమండలి సభ్యులు పీ రమేష్, ఎం శ్రీను, రంగా శ్రీను, కొండలు తదితరులు ఉన్నారు.

సుజాతనగర్ ఎస్‌హెచ్‌వోగా జుబేదా బేగం..



జుబేదా బేగం

సుజాతనగర్, ఫిబ్రవరి 16: సుజాతనగర్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్‌హెచ్‌ఓగా ఎస్సై జుబేదా బేగం శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఇల్లెందు, మణుగూరు పోలీస్ స్టేషన్లలో శిక్షణ పూర్తి చేసుకున్నారు. కొత్తగూడెంలోని రామవరం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా మొదటి పోస్టింగ్‌లో జాయిన య్యారు. సుజాతనగర్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు అప్పగించడంతో, సుజాతనగర్ మండలంలోని కొంత భాగం టూ టౌన్ పరిధిలో ఉండటంతో, అటు టూ టౌన్ పరిధిలోని ప్రజలు, ఇటు సుజాతనగర్ మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భద్రాద్రి డీపీఆర్వో శ్రీనివాసరావు బదిలీ



కొత్తగూడెం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లా డీపీఆర్వో శీలం శ్రీనివాసరావు శుక్రవారం బదిలీ అయ్యారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు బదిలీ చేస్తూ సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీనివాసరావును కలెక్టర్ డాక్టర్ ప్రియాంక శుక్రవారం సాయంత్రం విధుల నుంచి రిలీవ్ చేశారు. సహాయ పౌర సంబంధాల అధికారి అజ్‌గర్ హుస్సేన్‌కు డీపీఆర్వోగా ఇన్‌చార్జ్ బాధ్యతలు కలెక్టర్ అప్పగించారు.

రేపు దమ్మపేటలో జిల్లాస్థాయి పరుగు పందెం పోటీలు

దమ్మపేట , ఫిబ్రవరి, 16: దమ్మపేట గిరిజన గురుకుల కళాశాల ఆవరణలో ఆదివారం జిల్లాస్థాయి పరుగుపందెం పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరి కె.మహీధర్ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఈపోటీలలో 400మీటర్ల పరుగుపందెం నిర్వహిస్తున్నట్లు ఈపోటీలకు 14, 16, 18, 20 సంవత్సరాలలోపు బాల బాలికలు, స్త్రీ, పురుషులు పాల్గొనాలని కోరారు. ఇక్కడ ప్రతిభ కనబరిచిన వారిలో ఈనెల 25న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. వివరాల కోసం కోచ్ జె.కృష్ణను సెల్ నెం 7013552707 సంప్రదించాల్సిందిగా కోరారు.

జేఈఈ మెయిన్స్‌లో భద్రాచలం విద్యార్థి ప్రతిభ



భద్రాచలం, ఫిబ్రవరి 16: జాతీయస్థాయి జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో భద్రాచలంలోని సెయింట్స్‌పాల్స్ పాఠశాల పూర్వ విద్యార్థి జి.మధుకిరణ్ 98.29 శాతం పర్సంటైల్ సాధించారు. ఈ విద్యార్థిని పాఠశాల కరస్పాండెంట్ డా.కె.అబ్రహం, హెచ్ఎం రెవ.కె. రాధా మంజరి అభినందించారు. మా విద్యార్థి భవిష్యత్తులో తన లక్ష్యాలను సాధించాలని ఆశీర్వదించారు.

పాస్‌పుస్తకం లేని భూములకు పామాయిల్ మొక్కలు

అశ్వారావుపేట, ఫిబ్రవరి 16: కొత్త పాస్‌పుస్తకాలు లేకుండ సాగుచేస్తున్న భూములకు పామాయిల్ మొక్కలు సరఫరా చేస్తామని ఆయిల్‌ఫెడ్ డివిజనల్ అధికారి ఆకుల బాలకృష్ణ తెలిపారు. ఈ మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం ఉదయం 10గం.లకు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రారంభించనున్నామని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

క్రైస్తవులపై దాడులు సిగ్గు చేటు

జూలూరుపాడు, ఫిబ్రవరి 16: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్వేషాలను రెచ్చగొడుతూ క్రైస్తవులపై దాడులు జరిపించడం సిగ్గుచేటని ఉమ్మడి ఖమ్మం జిల్లా క్రైస్తవ హక్కుల పోరాటదళం అధ్యక్షుడు గోరపుడి ఇస్సాకు అన్నారు. శుక్రవారం మండలంలోని వెంగన్నపాలెం గ్రామంలో క్రీస్తు సంఘం కార్యాలయంలో పాస్టర్స్ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా శంకరపల్లి మండలం జన్వాడలో క్రైస్తవ దళితులపై ఇటీవల దాడి జరపడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. క్రైస్తవ నాయకులపై దాడులు చేస్తే ఊరుకోబోమని అన్నారు. ఈ సమావేశంలో సీఆర్పీఎఫ్ మండల అధ్యక్షుడు బిచ్చూనాయక్, కార్యదర్శి పాల్సన్, ఉపధ్యక్షుడు తిమోతీ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 16: మండలంలోని నారంవారిగూడెం కాలనీలో గల ముత్యాలమ్మ ఆలయ మొదటి వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు జరిపారు. ఉదయం అమ్మవారికి వివిధ రకాల అభిషేకాలను జరిపారు. అనంతరం అమ్మవారిని అలంకరించారు. సామూహిక కుంకుమ పూజలను జరిపారు. ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామపెద్దలు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.



అన్నదానం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి: ఎంపీపీ



పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ

అశ్వాపురం ఫిబ్రవరి 16: కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, ఎంపీపీ ముత్తినేని సుజాత పేర్కొన్నారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కృషితో మంజూరయిన రూ.40 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రహదారుల నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పారదర్శకంగా అభివృద్ధిపనులు చేపట్టడం జరుగుతుందన్నారు. కాగా మండల పరిధిలోని అశ్వాపురం, కొమ్ముగూడెం,అమ్మగారిపల్లి,సీతారాంపురం గ్రామాల్లో 8 సీసీ రహదారులకు భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వరప్రసాద్, పీఆర్ఏఈ చక్రదరచారి, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు షర్ఫుద్దీన్, అశ్వాపురం-2 ఎంపీటీసీ తుళ్లూరి గంగాభవాని, అశ్వాపురం పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు గాదె వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ముత్తినేని శ్రీనివాసరావు, వేములపల్లి రమేష్, పొడియం అనిల్‌కుమార్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు ఇవ్వాలని పేదల ఆందోళన



ఇల్లెందురూరల్, ఫిబ్రవరి 16: పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని ఇల్లెందు మండలం బాలాజీనగర్ గ్రామపంచాయతీలోని వివిధ వార్డులకు చెందిన మహిళలు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. మాజీ వైస్ ఎంపీపీ దాస్యం ప్రమోద్ ఆధ్వర్యంలో బాలాజీనగర్ గ్రామపంచాయతీకి చెందిన వివిధ వార్డుల మహిళలు తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సొంత ఇళ్లు లేక అద్దె ఇళ్లల్లో జీవిస్తున్నమని, ప్రభుత్వం తమను గుర్తించి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని తహసీల్దార్‌ను కోరారు. అదేవిదంగా పంచాయతీ భవనానికి కేటాయించిన స్థలాలను పరిరక్షించాలని వారు కోరారు. కార్యక్రమంలో వివిధ వార్డులకు చెందిన నాయకులు రాములు, శంకర్, సుబ్బలక్ష్మి, మంజులదేవి, స్వాతి, కళ్యాణి, భవాని, దుర్గమ్మ, దనమ్మ, విజయ, ఉష, జ్యోతి పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తులు, బ్యాగుల అందజేత



విద్యార్థులకు అందజేస్తున్న దుస్తులు, బ్యాగులు

చర్ల, ఫిబ్రవరి 16: తండ్రి జ్ఞాపకార్థం కామిని శివరామకృష్ణ పేద విద్యార్థులకు సాయం అందించడం ఎంతో సంతోషకరమని చర్ల తహసీల్దార్ భరణిబాబు అన్నారు. శుక్రవారం చర్లలోని వనవాణీ కళ్యాణ పరిషత్ విద్యాలయంలో చదువుతున్న విద్యార్థులకు శివరామకృష్ణ అందజేసిన రూ.25వేల దుస్తులు, బ్యాగులు, బియ్యాన్ని తహసీల్దార్ అందజేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ రామకృష్ణ తండ్రి కేవీ నర్సింహారావు చర్ల ఎంఈవోగా పని చేసి అందరి మన్ననలు పొందారన్నారు. కార్యక్రమంలో మీకోసం మేమున్నాం కమిటీ చైర్మన్ నీలి ప్రకాష్, దొడ్డి తాతారావు, దొడ్డా ప్రభుదాస్, మల్లాది సుబ్రమణ్యం, పెద్దాడ ఆశాలత, కోరం సూర్యనారాయణ, తాటి పాపారావు, కోగికార్ రాంలక్ష్మణ్. బందా స్వరూప, గొంది శోభన్‌బాబు తదితరులు ఉన్నారు.

అయోధ్యకు సైకిల్ యాత్ర

అశ్వారావుపేట, ఫిబ్రవరి 16: తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి నుంచి అయోధ్యకు ఇద్దరు యాత్రికులు పయనమయ్యారు. రాజమండ్రికి చెందిన బట్టిమిల్లి త్రినాద్, భైల శేషు అనే ఇద్దరు యాత్రికులు సుమారు 1500కి.మీ. దూరంలో ఉన్న అయోధ్యకు బయలుదేరి శుక్రవారం అశ్వారావుపేటకు చేరుకున్నారు. 15రోజుల్లో అయోధ్యకు చేరుకుంటామని వారు తెలిపారు. అశ్వారావుపేటకు చేరుకున్న యాత్రికులకు శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ అధ్యక్షుడు, వాసవీక్లబ్ అధ్యక్షుడు జల్లిపల్లి దేవరాజ్, డ్రిస్ట్రిక్ట్ కార్యదర్శి ఎస్ సుబ్బారావు వారికి ఆహ్వానం పలికి, ప్రయాణానికి అవసరమైన కొంత సహాయాన్ని అందజేశారు.

అశోక్, గోపీలను విడుదల చేయాలి: ఎన్డీ



ర్యాలీ నిర్వహిస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

ఇల్లందు టౌన్, ఫిబ్రవరి 16: న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి కురసం వజ్జయ్య అలియాస్ అశోక్, వరంగల్ జిల్లా కార్యదర్శి దనసరి సమ్మయ్య అలియాస్ గోపీలను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేసి దాచారని తక్షణమే వారిని విడుదల చేయాలని న్యూడెమోగ్రసీ నాయకులు ఆవునూరి మధు, సీతారామయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఇల్లెందులో అశోక్, గోపీలను విడుదల చేయఆలని ప్రదర్శన నిర్వహించారు. మాట్లాడుతూ ఆదివాసీ ప్రజల హక్కుల కోసం పనిచేస్తున్న అశోక్, గోపీలను ఖమ్మం, వరంగల్ పోలీసులు ఈనెల 14న అక్రమంగా అరెస్ట్ చేశారని ఆరోపించారు. వారిని తక్షణమే విడదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర నాయకులు మోకాళ్ల రమేష్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు ఎండీ రసుద్దీన్, సారంగపాణి, తోడేటి నాగేశ్వరావు, తుపాకుల నాగేశ్వరరావు, రాంసింగ్ , ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సౌకర్యం ప్రారంభం

భద్రాచలం, ఫిబ్రవరి 16: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో తానీషా కల్యాణ మండపం పక్కన వసతి గృహ సముదాయానికి విద్యుత్తు సౌకర్యం కోసంరూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన నూతన హెచ్‌టి లైన్ ట్రాన్స్‌ఫార్మర్‌ను దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి ప్రారంభించారు. ఈ హెచ్‌టి లైను ద్వార వసతి గృహ సముదాయాలకు విద్యుత్తు సరఫరాను అందించనున్నారు.

ముమ్మరంగా టీజీవో సభ్యత్వ నమోదు



సభ్యత్వాన్ని ప్రారంభిస్తున్న టీజీవో నాయకులు

పాల్వంచ రూరల్, ఫిబ్రవరి 16: తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ సంఘం జిల్లా కార్యదర్శి పి. విజయ్‌కుమార్ శుక్రవారం పాల్వంచలో ప్రారంభించారు. పాల్వంచ మండలంలోని వివిధ శాఖల గెజిటెడ్ అధికారులతో ఆయన సభ్యత్వాలు చేయించారు. ఆయన మాట్లాడారు. గెజిటెడ్ అధికారుల సమస్యల కోసం, గెజిటెడ్ అధికారుల పదోన్నతుల విషయంలో నిరంతరం పని చేస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు ఎం. రమేష్, సీడీపీవో కనకదుర్గ, ఎండీ ఖాసీం, సంతోష్, ఆనంద్ తదితరులు ఉన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 'పది' విద్యార్థులకు అల్పాహారం



అల్పాహారం అందజేస్తున్న లయన్స్ సభ్యులు

మణుగూరుటౌన్, ఫిబ్రవరి 16: మునిసిపాలిటీ పరిధిలోని జడ్పీ బాలికలఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు నెల రోజులపాటు అల్పాహారం అందించేందుకు మణుగూరు లయన్స్ క్లబ్ ముందుకువచ్చింది. పరీక్షలు ముగిసే వరకు సాయంత్రం సమయంలో అల్పాహారాన్ని అందించనున్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పూర్ణచందర్ రావు మాట్లాడారు. తన పుట్టిన రోజును పురస్కరించుకుని పరీక్షలకు సిద్ధమవుతోన్న విద్యార్థినులకు అల్పాహారాన్ని అందించాలనుకున్నాని, అందుకు వెంటనే పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ అంగీకరించారని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ జ్యోతి మాట్లాడుతూ.. విద్యార్థులు సాయంత్రం సమయంలో నిరసపడిపోకుండా అల్పాహారాన్ని అందించేందుకు ముందుకు వచ్చిన పూర్ణకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు మీరా హుస్సేన్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

దానధర్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో..

మండల పరిధిలోని సమితిసింగారం పంచాయతీ బుడగ జంగాల గుంపు ప్రాంతంలో వలస కుటుంబాల పిల్లలకు, వృద్ధులకు దానధర్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆహార ప్యాకట్లను అందజేశారు. సుమారు వందమందికి పైగా ఆహార ప్యాకెట్లను అందించినట్లు ట్రస్ట్ చైర్మన్ గంటా రాధా తెలిపారు. కార్యక్రమానికి ఆర్థికంగా సహకరించిన పెద్దలకు కృతజ్ఞతలు తెలిపింది.

ఒత్తిడిని జయించడం ఎలా?

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఫిబ్రవరి16: పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమై వందశాతం ఫలితాలు సాధించే దిశగా ప్రయత్నించాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు జవ్వాది వెంకటేశ్వరబాబు అన్నారు. శుక్రవారం పట్టణంలోని కూలీలైన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం కల్యాణ్‌శర్మ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. భయం, ఒత్తిడి, ఆందోళనను అధిగమించే మార్గాలను వివరించారు. ఏబీసీడీ టెక్నిక్, పంచ సూత్రాలు, దశ విధానాలు, ఆహార నియమాలు, మొదలగు విషయాలను తెలియజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్వరబాబు

గాయత్రీమాత ఆలయంలో రథసప్తమి వేడుకలు



సూర్య నమస్కారం చేస్తున్న గురుజీ

దమ్మపేట/మణుగూరు ఫిబ్రవరి, 16: స్థానిక గాయత్రి ఆలయంలో గాయత్రి ట్రస్ట్ మందిర వ్యవస్థాపకులు మూర్తీ గురుజీ ఆధ్వర్యంలో శుక్రవారం రథసప్తమి వేడుకలు నిర్వహించారు. రథసప్తమి సందర్భంగా సూర్య భగవానునికి సూ ర్య నమస్కారాలు నిర్వహించి పూజలు చేశారు. గాయత్రి మాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథసప్తమి సందర్భంగా పొంగలి చేసి పూజలు నిర్వహించి భక్తులక తీర్థ ప్రసాదాలను అందజేశారు.

మణుగూరు: పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో శుక్రవారం రథసప్తమి సందర్భంగా విద్యార్థుకు యోగా శిక్షణలో బాగంగా సూర్యనమస్కారాలు నేర్పించారు. సుజాషుమార్షు యజమాని, యోగా గురువు శ్రీనివాసరెడ్డి చిన్నారులకు సూర్య నమస్కారాలు ఎలా చేయాలో నేర్పించారు. కార్యక్రమంలో వందనపు నాగేశ్వరరావు, శ్రీనివాస్, జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, పాఠశాల డీన్ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు